


# అసైన్‌మెంట్ కమిటీ పెద్దలకా.. పేదలకా!

**- భూస్వాములకే భూ పంపిణీ - జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలంటున్న మండల ప్రజలు**

ఓజిలి, మార్చి 30 ప్రభాతవార్త : భూమి లేని నిరుపేదలను గుర్తించి భూపంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూ సర్వేలో విస్తారంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు బయటపడ్డాయి. భూస్వాములు వారి అనుచరులకే భూములు పెట్టించి అర్హులైన పేదలకు పక్కకు నెట్టేసి భూపంపిణీ జాబితా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపేందుకు సిద్ధంచేసినట్లు సమాచారం. ఎన్నో వేల ఎకరాలు ప్రభుత్వ భూములు ఖాళీగా ఉండగా, అర్హులను పక్కన పెట్టి భూస్వాములను జాబితాలో చేర్చి ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం ఇది తొలి జాబితా మాత్రమే అని, ఇంకా రెండు మూడు జాబితాలు ఉన్నాయని బుకాయించడం మండలంలో చర్చనీయాంశమైంది. గ్రామాల్లో ప్రభుత్వ భూముల వివరాలు తీసుకొని ఆ భూములు కబ్జాలో ఉన్నాయి, పేదలు సాగు చేసుకుంటున్నారా అనే విషయమై ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాల్సి ఉంది. గ్రామసభల ద్వారా ఎంపిక చేసి అవే పేర్లు సిద్ధం చేసి అసైన్‌మెంట్ కమిటీ తీర్మానానికి పంపించారు. కమిటీలో ఇన్‌ఛార్జ్ మంత్రి, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఆర్డీఓలు, రెవెన్యూ అధికారులు సభ్యులుగా ఉంటారు. కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే ఉంటారు. భూ పంపిణీ రోజు భూమి పట్టాలు పంచేందుకు సమావేశం నిర్వహిస్తారు. అయితే భూస్వాములు, నేతల కనుసన్నల్లో అనర్హులకు, భూస్వాములకు భూపంపిణీ చేస్తున్నట్లు సమాచారం. అధికారులు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించకుండానే భూపంపిణీ చేసేందుకు జాబితా సిద్ధంగా ఉంచినట్లు జరుగుతున్న ప్రచారంపై పలు విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. భూస్వాములకు భూపంపిణీలో పేర్లు చేర్చడంపై మండలం లోని నిరుపేదలు ఆందోళనకు సిద్ధవుతున్నారని సమాచారం. జిల్లా కలెక్టర్ స్పందించి ఈ భూపంపిణీ జాబితాను నిలుపుదల చేసి అర్హులైన నిరుపేదలకు గుర్తించి ఆ భూమి ఇప్పించాలని మండలంలోని నిరుపేదలు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు అసైన్‌మెంట్ సమావేశంలో నిరుపేదలకు చోటు కల్పిస్తారా లేక భూస్వాములకు కల్పిస్తారా.. ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

### వైద్య విద్యార్థులు...

## పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలి

**-న్యూరోసర్జరీ చైర్ ఒరేషన్‌లో డాక్టర్ వెంగమ్మ**



తిరుపతినగరం, మార్చి 30 ప్రభాతవార్త : న్యూరోసర్జరీ విభాగ సేవలను పరిగణలోనికి తీసుకుని ఒరేషన్ కార్యక్రమంలో వైద్య విద్యార్థులు పాల్గొని తమ వైద్య పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలని ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ వెంగమ్మ అన్నారు. గురువారం శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు న్యూరో సర్జరీ ఆధ్వర్యంలో చెరుకూరి నరసింహం, సుభద్రాదేవి 8వ చైర్ ఒరేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేరళ రాష్ట్రం, తిరువనంతపురం చిత్ర తిరునాల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్స్ అర్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ సంజయ్ బిహారి రావడం ఎంతో ఆనందగా వుందన్నారు. వారిచే ఏర్పాటు చేసిన బయో ఎథిక్స్ ఇన్ మెడిసిన్ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా వుందన్నారు. స్విమ్స్ న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ వి.వి రమేష్‌చంద్రగా మాట్లాడుతూ డాక్టర్ సంజయ్ న్యూరోసర్జరీ విభాగానికి ఎనలేని సేవలందించారని, విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని, ఆయన ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డు అందుకున్నారని తెలిపారు. డాక్టర్లు శరణ్ బి సింగ్, రామ్, వివి.రమేష్‌చంద్ర, శివకుమార్,అలోక్‌లోచన్, టిసికళావత్, వనజాక్షమ్మ, గోపాల్‌రెడ్డి, వెంకట్, చంద్ర శేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి,ప్రవీణ్,వెంకటేష్,స్వాతిక్,మహేష్, న్యూరోసర్జరీవైద్యులు,విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రాణదాన పథకంలో 154 మంది రోగులు ఎంపిక:**

స్విమ్స్ ఆసుపత్రిలో గురువారం డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ ఆధ్వర్యంలో ప్రాణదాన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో 154 మంది పేదరోగులు నెఫ్రాలజిలో 12, రేడియేషన్ అంకాలజీలో 13, న్యూరోసర్జరీలో 34, గ్యాస్ట్రోఎంట్రాలజిలో 12, న్యూరాలజీలో 26, మెడిసిన్‌లో 25, సర్జికల్ ఆంకాలజీలో 14, కార్డియాలజీలో 2, కార్డియో థొరాసిక్‌లో 10, మెడికల్ ఆంకాలజీలో 5, యూరాజీలో ఒకరు ఎంపిక అయినట్లు వివరించారు. టిటిడి ప్రాణదాన పథకానికి దాతలు, సంస్థలు సహృదయంతో ముందుకు వచ్చి విరివిగా విరాళాలు ఇచ్చారన్నారు.

### లోకకళ్యాణార్థ చట్టాలను...

## చుట్టాలు చేసుకోవటం తగదు

**-దీక్షను భగ్నం చేసిన తీరు ఆక్షేపణీయం : పవన్ కళ్యాణ్**



శ్రీకాళహస్తిరూరల్, మార్చి 30 ప్రభాతవార్త : లోక కళ్యాణార్థం, దళిత, గిరిజనులకు రక్షణగా రూపొందించిన దళిత,గిరిజన వేధింపు చట్టాలను ప్రస్తుత అధికార వైకాపా పార్టీ ఆపార్టీ నియోజకవర్గ నాయకులు అడ్డం పెట్టుకొని తమ పబ్బం గడుపుపోవటం తగదని జనసేన పార్టీ నాయకుడు పవన్ కళ్యాణ్ ధ్వజమెత్తారు. గురువారం ఆయన ఓ పత్రికా ప్రకటన జారీ చేస్తూ చట్టాలను అడ్డం పెటుకొని పోలీసులతో ఎంత కాలం పరిపాలన సాగిస్తారని ఆయన ప్రశ్నించారు.శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి వద్ద వెలసిన ఇసిఎల్ కంపెనీ ఓ గ్రామానికి చెందిన ప్రజలకు అనుకూలంగా ఉన్న రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మిస్తే ప్రశ్నించిన జనసేన నాయకులపై గాంధేయ పద్ధతిలో ఆందోళన చేస్తున్న తమ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వినూత కోటను అరెస్టు చేసిన తీరు ఆక్షేపణీయం అని పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయం నుంచి ఓ పత్రికా ప్రకటనను జారి చేసారు. శ్రీకాళహస్తినియోజకవర్గంలోని ఏర్పేడుమండలం చిందే పల్లి గ్రామ రహదారికైగ్రామస్థులు జనసేన నాయకులు, శ్రేణులుమూడు రోజుల పాటు చేపట్టిన నిరాహారదీక్షలను పోలీసుల భగ్నం చేసిన తీరు ఆక్షేపణీయం అన్నారు అలాగే గ్రామస్తుల డిమాండ్ మేరకు రహదారిని పునరుద్ధరించి కేసులను పోలీసులు ఉపసంహరించుకోవాలని పవన్‌కళ్యాణ్ డిమాండ్‌చేసారు. చిందేపల్లి వాసులకు జనసేన భవిష్యత్తులోకూడా అండగా ఉంటుందని తాను హామి ఇస్తున్నానని పవన్ కళ్యాణ్‌జారి చేసినప్రకటనలో పేర్కొన్నారు.

### రక్తం చిందించైనా...

## చిందేపల్లెకు న్యాయం చేస్తాం

**-జనసేన జిల్లా ఇన్‌ఛార్జ్ డా॥పసుపులేటి హరిప్రసాద్**



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జ్ డా॥పసుపులేటి

తిరుపతి ప్రెస్‌క్లబ్,మార్చి 30 ప్రభాతవార్త: అనేక గ్రామాలకు లింకు రోడ్డుగా ఉన్న చిందేపల్లెలోని రహదారి మూసేసి ఈసిఎల్ కంపెనీ వారు గోడ కట్టేసి, ప్రశ్నించిన గ్రామ ప్రజలపై పోలీసు కేసులు పెట్టి దారుణంగా వ్యవహరిస్తున్నారు. తమ జనసైనికులు రక్తం చిందించైనా సరే 'చిందేపల్లె' ప్రజలకు న్యాయం చేస్తామని జనసేన పిఏసి సభ్యుడు,ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జ్ డా॥పసుపులేటి హరిప్రసాద్ స్పష్టం చేశారు.గురువారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో తిరుపతి ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్,శ్రీకాళహస్తి ఇన్‌చార్జ్‌లు కోట వినూత,చంద్రబాబు,జనసైనికులు రాజారెడ్డి, రాజేష్, ఆకేపాటి సుభాషిణి, కీర్తన తదితరులతో కలిసి ఆయన మాట్లాడుతూ..జలియన్‌వాలాబాగ్ ఉందంతాన్ని తలపించేలా అప్పుడు తుపాకీ తూటాలు పేలితే,నేడు చిందేపల్లెలో లాటీలు, ఇనుప రాడ్లతో పోలీసులు దాడికి తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.దీనిపై గ్రామస్తులతో కలిసి న్యాయ పోరాటం చేస్తున్న వినూత, చంద్రబాబులను దారుణంగా వారిని దేశద్రోహులను అరెస్ట్ చేసినట్లు వాహనాలలో ఎక్కించుకుని బిఎన్.కండ్రిగ,ఎయిర్‌పోర్ట్,రామచంద్రాపురం పోలీస్ స్టేషన్లకు తరలించి అటెంప్ట్ టు మర్డర్,దేశద్రోహం చట్టం లాంటి కేసులు మోపడం దుర్మార్గమన్నారు.నేడు ఏపిలో ఐపిసి సెక్షన్లకు బదులు వైసిపి సెక్షన్లు కొనసాగుతున్నాయని మండిపడ్డారు.ఈ విషయంపై తమ అధినేత పవన్‌కళ్యాణ్‌తో చర్చించామని, అవసరమైతే అక్రమంగా కట్టిన గోడను బద్దలు కొట్టడానికి పవన్ ప్రత్యక్షంగా హారవుతూరన్నారు.ఈ రహదారి న్యాయ పోరాటంలో తాము ఎంఆర్ఓ, కలెక్టర్, ఎస్పీ తదితర అధికారులను కలిశామని, అయినా గ్రామస్తులకు న్యాయం జరగకపోవడం శోచనీయమన్నారు. చిందేపల్లె గ్రామస్తులకు న్యాయం జరిగే వరకు జనసేన నిద్రపోదని,చావో రేవో తేల్చుకుంటామని హెచ్చరించారు.

## కమనీయం...కాణిపాకంలో శ్రీ సీతారాముల కళ్యాణం



కళ్యాణోత్సవం సందర్భంగా మాంగల్యం చూపుతున్న అర్చకులు

కాణిపాకం, మార్చి 30 ప్రభాతవార్త: శ్రీరామనవమి పండుగ పర్వదినం సందర్భంగా గురువారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో శ్రీసీతారాముల కళ్యాణోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ప్రతి ఏటా శ్రీరామనవమి రోజున కాణిపాకం దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈమేరకు ఉదయం ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ముఖ్య అర్చకులు హరీష్‌స్వామి, అర్చకులు



ఆలయంలో తిరుమజనం అనంతరం స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహిం చారు. అనంతరం ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈమేరకు శ్రీసీతారాముల వారి ఉత్సవమూర్తులను ప్రత్యేకపల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ మండపానికి తీసుకువచ్చారు. అలాగే కళ్యాణోత్సవానికి కావలసిన పూజా సామాగ్రిని, స్వామి, అమ్మవార్లకు స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు మంగళవాయిద్యాల నడుమ కళ్యాణవేదిక వద్దకు తీసుకువచ్చి అర్చకులకు అందజేశారు. అనంతరం కళ్యాణానికి ఎటువంటి ఆటంకాలు కలుగకుండా అర్చకులు విశ్వక్సేనపూజ, పుణ్యాహావాచనం గావించారు. ఈసందర భంగా స్వామి అమ్మవార్లకు ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అలాగే సంప్రదాయ బద్ధంగా వధూవరుల ఇరువంశాల గోత్రనామాలను పఠించి స్వామివారికి పాదప్రక్షాళన చేశారు. మహాసంకల్పం అనంతరం జీలకర్ర, బెల్లంను సీతారాముల శిరస్సుపైవుంచి మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణలు మార్మోగుతుండగా భక్తులు భక్తి పారవశ్యంతో మునిగి తేలుతుండగా 11 గంటల నుండి 12 గంటల లోపు అభిజిత్ లగ్నమందు అమ్మవారి మెడలో శ్రీరామచంద్రమూర్తి మాంగల్యధారణ చేశారు. అనంతరం వధూవరులిరువురు ముత్యాల తలంబ్రాలు పోసుకున్నారు. ఈసందర్భంగా కనులవిందుగా ఎదురుకోలు నిర్వహించారు. కళ్యాణోత్సవం పూర్తయిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా జరిగిన కళ్యాణోత్సవంను తిలకించిన భక్తజనం పులకించిపోయారు. ఈకార్యక్రమంలో మండల వైకాపీ కన్వీనర్ బుజ్జిరెడ్డి, చిగరపల్లె గణేష్ ప్రసాద్‌రెడ్డి, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుదు, బాబు, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## పోలీసుల పేరుతో నాయకుల వసూళ్ళ దందా!



జెసిబిల ద్వారా ట్రాక్టర్‌కు ఇసుకను నింపుతున్న దృశ్యం

గంగవరం, మార్చి 30, ప్రభాతవార్త : ఆయకట్టు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొందరు ఆధికార పార్టీ నాయకులు దళారుల అవతారమెత్తి పోలీసుల పేరుతో మామూళ్ళు వసూళ్ళు చేస్తున్న వైనం మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..మండలంలోని తాళ్ళపల్లె పంచాయతీ తమ్మిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆయకట్టు రైతు తనకున్న సుమారు రెండు ఎకరాల వ్యవసాయ పొలంలో పండించిన పంటల్లో వరుసగా నష్టాలు వాటిల్లుతుండడంతో అప్పులు పాలు కావడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో అయోమయంలో పడ్డాడు.ఈ నేపథ్యంలో కొందరు మిత్రుల సలహా మేరకు తన వ్యవసాయ పొలంలోని ఇసుకను అమ్ముకోవడానికి శ్రీకారం చుట్టాడు. తన వ్యవసాయ పొలంలోని ఒక ట్రాక్టర్ లోడ్ ఇసుకను రూ.1000లకు విక్రయిస్తున్నాడు .అయితే ఇదే గ్రామానికి చెందిన తాళ్ళపల్లె పంచాయతీ సచివాలయ కన్వీనర్, ఇతని అనుచరులు ఇసుకను విక్రయిస్తున్న ఆయకట్టు రైతు అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను విక్రయించడం నేరమని,ప్రతి ట్రాక్టర్ లోడ్‌కు ప్రభుత్వానికి పన్ను చెల్లించాల్సి ఉంటుందని,తన సొంత పొలంలో ఇసుకను కానీ మట్టిని కానీ తరలించాలన్న అందుకు అధికారుల అనుమతి తప్పనిసరి అని నమ్మించాడు.దీంతో రైతు మళ్ళీ అయోమయంలో పడ్డాడు.అయితే దళారీ నువ్వేమి బయపడకు ఎమ్మెల్యే మా బంధువు,మనది నియోజక వర్గంలోనే బలమైన సామాజికవర్గం అని నేను చెప్పితే ఏ అధికారైనా నా మాట వినాల్సిందేనని ఇందుకోసం ముందుగా గంగవరం పోలీసులకు నెలవారి మామూళ్ళు సమర్పించాలని సూచించాడు.రైతు వద్దకు ప్రతి రోజు పలమనేరు,గంగవరం మండలాలకు చెందిన దాదాపు 20 నుంచి 30 ట్రాక్టర్లు ఇసుకను రవాణా చేస్తున్నాయి.ప్రతి నెల ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.5000 చొప్పున వసూలు చేసి గంగవరం పోలీసులకు ఇవ్వాలని చెప్పడంతో విధిలేని పరిస్థితిలో ప్రతి ట్రాక్టర్ యజమాని నెలకు రూ.5000ను ఓ నేతకు చెల్లిస్తున్నారు. ఈ విధంగా పార్టీనేత పోలీసుల పేరు చెప్పి ప్రతి ట్రాక్టర్ వద్ద రూ.5000 దర్జాగా వసూలు చేసి లక్షల్లో అక్రమార్జనను గడిస్తున్నాడు.ఇంతే కాకుండా ఆ నేత తన ట్రాక్టర్‌తో పాటు మరో రెండు ట్రాక్టర్లను అద్దెకు తీసుకొని ప్రతి రోజు రేయింబవళ్ళు 25 లోడ్ల ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ ప్రభుత్వ ఆధాయానికి భారీగా గండి కొడుతున్నాడు.ఈ విషయమై గంగవరం ఎస్ఐ సుధాకర్‌రెడ్డిని ఆ దళారీ పోలీసుల పేరుతో ఇసుక ట్రాక్టర్ల వద్ద మామూళ్ళు వసూలు చేస్తున్నారని ప్రభాతవార్త వివరణ కోరగానే ఎస్ఐ మొదట చిందులేసి ఊగిపోయాడు. ఎస్ఐ ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న అందుకు సంబంధించిన ఫోటోలను,ప్రదేశాన్ని సంబంధిత ఎస్ఐ సుధాకర్‌రెడ్డికి ప్రభాతవార్త మొబైల్ ద్వారా పంపిన కూడా ఆయన అటువైపు ఆయన కన్నెత్తి చూడకపోవడం, వాహనాలను అదుపులోకి తీసుకోకపోవడం, స్పందించకపోవడం కొసమెరుపు. మీడియా ప్రతినిధులు సమాచారం అందించిన స్పందించని ఎస్ఐ ఇక సాధాకణ ప్రజల ఫిర్యాదుల పట్ల ఏ విధంగా స్పందిస్తారో అర్థమవుతుంది.

### దేశ్ కా బచావో-మోడీ హటావో...

## నినాదంతో నిరసనలు

**-వివేకా హత్య కేసు భయంతోనే జగన్ ఢిల్లీ యాత్ర**
**-పోలవరం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు**
**-సిపిఐ జాతీయ కార్యదర్శి డా॥కె.నారాయణ**



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి

తిరుపతి ప్రెస్‌క్లబ్,మార్చి 30 ప్రభాతవార్త: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 14 నుండి మే 15వ తేదీ వరకు 'దేశ్ కా బచావో-మోడీ హటావో' అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రజా చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నట్లు సిపిఐ జాతీయ కార్యదర్శి డా॥కె.నారాయణ తెలిపారు.గురువారం స్థానిక బైరాగిపట్టెడలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం రాహుల్ గాంధీ పట్ల కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు.రాహుల్ పట్ల కేంద్ర ప్రభుత్వ విఖరిని నిరసిస్తూ అన్ని రాజకీయ పార్టీలతో కలిసి త్వరలో ఉద్యమం చేపడతామని అన్నారు.వివేకానందరెడ్డి హత్య కేసు సుప్రీంకోర్టులో చివరి దశకు రావడంతో భయంతో పదే పదే జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీకి వెళుతున్నారని అర్థమవుతోందన్నారు.దీనిని ఆసరాగా చేసుకుని బిజెపి పెద్దలు జగన్‌ను బ్లాక్‌మెయిల్ విధానానికి వాడుకుంటున్నారని విమర్శించారు. అమిత్ షాతో జగన్ రాజకీయ ఒప్పందం కుదుర్చుకుని,వివేకా హత్య కేసు నుండి తప్పించడానికి కర్ణాటక ఎన్నికల్లో తన స్వంత డబ్బులతో 100 సీట్లు గెలిపించేటట్లు జగన్ ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. దీని కారణంగానే వివేకా కేసు రోజు రోజుకు ఆలస్యం అవుతోందన్నారు.పోలవరం ప్రాజెక్టు పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు.పోలవరం నిర్వాసితులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం కేంద్రం నుండి రప్పించి ఆదుకోవాలని జగన్‌కు సూచించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపకుండా, స్మశానంలా మారుస్తున్నాడని జగన్‌పై విరుచుకుద్దారు.ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు విజయలక్ష్మి,నాయకులు మురళి,నాగరాజు,చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, విశ్వనాథ్, నదియా,తదితరులు పాల్గొన్నారు.

## నీవానదిని పరిశీలించిన మంత్రి

చిత్తూరు, మార్చి 30 ప్రభాతవార్త: చిత్తూరులో నీవానది ప్రవాహంను గురువారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పరిశీలించారు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ దర్శనార్థం గురువారం విచ్చేసిన మంత్రి అక్కడి నుండి చిత్తూరులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నివాసానికి విచ్చేశారు. కాణిపాకం-చిత్తూరు మార్గమధ్యలో సంతపేట వద్ద నీవానదిని మంత్రి ఆంబటి రాంబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంత్రి ఆంబటి రాంబాబుతో మాట్లాడుతూ వరదలు వచ్చిన సమయంలో నీవానది చుట్టూ వున్న నివాసాలు జలమయం అవుతున్నాయని వివరించారు. నీవానది చుట్టూ 11 కిమీ మేరకు రక్షణ గోడలు, కల్వర్టులు, చెక్‌డ్యామ్‌లు, బ్రిడ్జిల నిర్మాణానికి 120 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని గతంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి విన్నవించినట్లు ఎమ్మెల్యే మంత్రి ఆంబటి రాంబాబుకు వివరించారు. దీనిపై మంత్రి ఆంబటి రాంబాబు సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే ప్రతిపాదించిన ప్రతిపాదనలను వీలైనంత త్వరగా మంజూరు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి ఆంబటి రాంబాబు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నివాసానికి తేనీటి విందుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




వెబినార్‌లో పాల్గొన్న వివిధ దేశానికి చెందిన వక్తలు

### ఘనంగా అంతర్జాతీయ...

## అంతర్జాల సదస్సు

తిరుపతి (విద్య), మార్చి 30 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాల సింగపూర్ తెలుగు సమాజం, సింగపూర్, దశరధ రామ పౌండేషన్ చిత్తూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ అంతర్జాల సదస్సు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి రామాయణం - గరుడ రక్ష అనే అంశం పై ఇండోనేషియా నుంచి శ్రీ రామాయణ హరినాధ్ రెడ్డి ఉపన్యాసం ఇచ్చారు. 25 దేశాలు పాల్గొన్న ఈ వెబినార్‌కు గౌరవ అధ్యక్షులుగా కాణిపాకం వరిసిద్ధి వినాయక దేవస్థానం ఛైర్మన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రామాయణం అంటే రాముని యొక్క ఆయనం ధర్మబద్ధమైన ప్రయాణం రామునిది. మనం కూడా ఆ దారిలో నడవాలని రామాయణం తెలియజేస్తుందన్నారు. అనంతరం తిరుపతి తిరుమల దేవస్థానం విద్యాశాఖాధికారి డా.ఎం. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రామాయణంలోని ప్రాంతాలన్నీ సజీవ చిత్రాలన్నారు. కుటుంబ విలువలను తెలియజేసే రామాయణం మన జీవితంలో భాగం కావాలన్నారు. వెబినార్ అధ్యక్షులు కళాశాల ప్రిన్సిపాల్ డా. మహదేవమ్మ మాట్లాడుతూ రామాయణంలోని అద్భుత ఘట్టాలను తెలుసుకోవాలన్నారు. సింగపూర్ తెలుగు సమాజం అధ్యక్షులు కోటిరెడ్డి, ఉపన్యాసకులు రామాయణ హరినాధ్ రెడ్డి, తెలుగు విభాగాధిపతి డా. కృష్ణవేణి, సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షులు జోతీశ్వర్ రెడ్డిలు మాట్లాడుతూ మానవులు ఎలా బ్రతకాలో చూపించిన శ్రీరామునిలా మనం గడపాలని తెలిపారు. పూర్వ జన్మ కర్మల ఫలితంగా మన జీవితం ఉంటుందన్నారు. అలాగే సనాతన సాంప్రదాయ నిలయమయిన మన భారతదేశంలోని కుటుంబాలలో పుట్టుక నుండి రామాయణాన్ని తొలి పాటల ద్వారా గానం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లండన్ నుంచి నరేష్, వెర్లండ్ నుంచి శ్రీనివాస్, అమెరికా నుంచి మాధవ కృష్ణ, సింగపూర్ నుంచి పద్మజలు పాల్గొన్నారు.

### శ్రీరామనవమి పర్వదినాన...

## నూతన వస్త్రాల్లో మెరిసిన కోదండరాముడు





తిరుపతి,మార్చి 30ప్రభాతవార్త: తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో గురువారం ఉదయం శ్రీరామనవమి పర్వదినం వేడుకలు వైభవంగా జరిగాయి. తెల్లవారు జామున కోదండరామస్వామి మూలవర్లకు అభిషేకం చేశారు. ఉదయం 8గంటల నుంచి 9వరకు ఊంజల్ మండపంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. భక్తుల రద్దీ భారీగా పెరగడంతో ఆలయ అధికారులు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటుచేసి దర్శనానికి అనుమతించారు. సాయంత్రం పెద్దజీయర్‌స్వామి మఠం నుంచి అర్చకులు నూతన వస్త్రాలను తీసుకుని విమానప్రదక్షిణగా ఆలయంలోనికి చేరుకుని కోదండరామస్వామి మూలవర్లకు, ఉత్సవమూర్తులకు అలంకరింపజేశారు. ఆ తరువాత శ్రీరామ జన్మవృత్తాంతం, ఆస్థానం నిర్వహించారు. రాత్రి 7గంటలకు స్వామివారు హనుమంత వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. ఆలయంలో భక్తులకు పానకం, ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఎఇఒ మోహన్, ఆలయ సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, కంకణ భట్టార్ ఆనంద దీక్షితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.తిరుపతి బండ్లవీధిలో, కాపువీధిలో, శ్రీనివాసం ఎదురుగా ఉన్న సీతారాముల ఆలయంలో, అభయ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఏర్పాట్లు చేసి భక్తులకు దర్శనం కల్పించారు

## అతిథి అధ్యాపకులు దరఖాస్తులు ఆహ్వానం

వెదురుకుప్పం, మార్చి 30 ప్రభాతవార్త :



వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెదురుకుప్పంలో అతిథి అధ్యాపకులు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ శారద గురువారం తెలిపారు. ఆశక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవలన్నారు. ఏం.కామ్‌తో పాటు యూ జీసీ నెట్ లేదా సెట్ విద్యార్హత కలిగిన వారు అవసరమని చెప్పారు. పీహెచ్‌డి కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన వారు సర్టిఫికేట్లతో ఏప్రిల్ 4న కళాశాలలో జరుగు ఇంటర్వ్యూకు హాజరుకావలని తెలిపారు. ఇతర వివరాలకు 6302500965, 9866415051 సెల్ నంబర్లను సంప్రదించాలని చెప్పారు.

## కళ్యాణం కమనీయం సీతారాముల కళ్యాణ వేడుకలు

వెదురుకుప్పం, మార్చి 30 ప్రభాతవార్త :



శ్రీరామ నవమి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెరుమాళ్ళపల్లె, సంతబ యలు, గుండుపల్లె, పాతగుంట, పచ్చికాపల్లం, డిఆర్ఎన్ కండిగ సమీపంలోని అరుణగిరి కొండ పై వేలసిన జ్ఞాన ప్రసునాంభ సమేత కొండమల్లేశ్వరస్వామి ఆలయాలల్లో నిర్వహ కులు చలువ పందిరిలు వేసి మూలవిరాట్, ఉత్సవమూర్తులకు వివిధ అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా వస్త్రాలు, ఆభరణాలు, పూలతో అలంకరించి పూజలు నిర్వహించి భక్తులకు దైవదర్శన భాగ్యం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## తవణంపల్లెలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

తవణంపల్లె, మార్చి 30 ప్రభాతవార్త:



శ్రీరామనవమి పండుగ పర్వదినాన్ని మండల ప్రజలు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా మండలంలోని తవణం పల్లె, ఎగువ వెంకటాపురం, వెంగంపల్లె, దిగువమాఘం, ఈచనేరి, మత్యం, అరగొండ, టి.పుత్తూరు, దిగువమత్యం తదితర గ్రామాలలోని భజన మందిరాలు, శ్రీకోదండరాములస్వాముల వారి ఆలయాల్లో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, అర్చకులు పాల్గొన్నారు. **అర్ధగిరి ఆలయంలో...** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలను గురువారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో శ్రీనామనవమి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు గురువారం ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ఛైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఈఓ వెంకట సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో ఈవేడుకలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. .

## గణనాధుని సేవలో ఏపీ హైకోర్టు జడ్జి

కాణిపాకం, మార్చి 30 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సుజాత గురువారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. వారి వెంట చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీనివాసులురెడ్డి, ఐరాల తహశీల్దార్ సుశీల, ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

బంగారుపాళ్యం, మార్చి 30 ప్రభాతవార్త:

మొగిలి వెంకటగిరిలో వెలసిన శ్రీ కోదండరామాలయంలో గురువారం వైభవంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఆలయంలోని మూల విరాట్ సీతారామ లక్ష్మణుల విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనం కోసం భక్తులు తెల్లవారుజాము నుండి క్యూ లైన్లలో బారులు తీరారు. వివిధ పుష్పాలతో అలంకరించిన సీతా రాముల ఉత్సవ మూర్తులను మంగళ వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త తులసీరామకృష్ణారెడ్డి, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, ఆలయ ఛైర్మన్ ప్రకాష్, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే బంగారుపాళ్యం బ్రహ్మణ వీధిలో వెలసిన శ్రీ కోదండరామాలయ భజన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ కామరాజు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి పెద్దిరెడ్డిచే శ్రీ రాళ్లగంగమ్మ జాతర పోస్టర్ల ఆవిష్కరణ

కుప్పం, మార్చి 30 ప్రభాతవార్త :



మండల కేంద్రమైన గుడుపల్లె సమీపంలో వెలసిన శ్రీ ప్రసన్న రాళ్ల గంగమాంబ జాతరకు సంబంధించిన పోస్టర్లను రాష్ట్ర అటవీ, విద్యుత్, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరుపతిలో ఆవిష్కరించారు. గురువారం చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ నేతృత్వంలో గుడుపల్లె వైకాపా నేతలు కలసి మంత్రిచే జాతర పోస్టర్లను ఆవిష్కరించి మంత్రిని జాతరకు ఆహ్వానించారు. కార్యక్రమంలో గుడుపల్లె కోకన్వీనర్ రామూర్తి, శాంతిపురం కన్వీనర్ దండపాణి, శాంతిపురం ఎంపిపి వసుంధర కోదండరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ పెద్దపల్లి గంగమాంబ ఉత్సవం

కుప్పం, మార్చి 30 ప్రభాతవార్త :



స్థానిక కొత్తపేటలో వెలసిన శ్రీ ప్రసన్న పెద్దపల్లి గంగమాంబ జాతర ఘనంగా జరుగుతోంది. గురువారం అమ్మవారిని సూర్యప్రభ, శేష,హంస, వృషభ వాహనాలపై ఊరేగించారు. ఈసందర్భంగా ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఫిబ్రవరి 9వతేది వరకు జాతర జరుగుతుందని ఆలయ ధర్మకర్త శివకుమార్ తెలిపారు.

## వివాహిత అనుమానాస్పద మృతి!

-భర్త..అత్తలే హతమార్చారని ఫిర్యాదు

కుప్పంరూరల్, మార్చి 30 ప్రభాతవార్త :



మండలంలోని ఉర్లఓబనపల్లికి చెందిన మునస్వామి కుమార్తె మంజుల తన భర్త ఇంట్లో అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. కాగా తన కుమార్తెను ఆమెభర్త, అత్త వేధించి హతమార్చారని మంజుల తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మునస్వామి ఫిర్యాదు మేరకు వివరాలిలా.. గుడుపల్లె మండలం కనమనపల్లికి చెందిన లక్ష్మక్క కుమారుడు వెంకటేష్‌తో మంజులకు నాలుగేళ్ల క్రితం వివాహ ం జరిగింది. వీరికి సంతానం కలగలేదు. ఈ నేపథ్యంలో తరచూ అత్త, భర్తలు ఆమెను వేధించడంతో పాటు వరకట్నం తేవాలని వేధించేవారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా బుధవారం రాత్రి తనకుమార్తె తనతో ఫోన్‌లో మాట్లాడిందని తనను వేధిస్తున్నారని పేర్కొందని అయితే మరలా అర్ధరాత్రి వేరే నెంబరు నుంచి తమకు ఫోన్ వచ్చిందని తన కుమార్తె పిఇఎస్ ఆస్పత్రిలో మృతి చెందిందని పేర్కొన్నారన్నారు. తన కుమార్తె చావుకు భర్త, అత్తలే కారణమని మృతురాలి బంధువులు ధర్నా చేపట్టారు. అనంతరం పోలీసులు వారికి నచ్చజెప్పి ధర్నా విరమించారు. కాగా మంజుల భర్త వెంకటేష్, అత్త పరారీలో ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాజ్‌కుమార్‌చే అన్నదానం

కుప్పంరూరల్, మార్చి 30 ప్రభాతవార్త :



కుప్పం మున్సిపల్ తెదేపా అధ్యక్షుడు రాజ్‌కుమార్ గురువారం కుప్పంలో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. తన జన్మదినం సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా సుమారు ఐదువందలమందికి అన్నదానం జరిపారు. కార్యక్రమంలో నేతలు బిఎంకె రవిచంద్ర, సతీష్, వినయ్, రాజేష్, నరేష్, యశోదమ్మ, తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీసీతారాముల కళ్యాణోత్సవం

కుప్పంరూరల్, మార్చి 30 ప్రభాతవార్త :



శ్రీరామనవమి పండగను మండలం లో ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా కుప్పంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీసీతారాముల కళ్యాణోత్స వంను కన్నులపండువగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను ఈసందర్భంగా విశేషంగా అలంకరించారు. మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ దంపతుల అధ్వర్యంలో ఈ కళ్యాణోత్సవంను నిర్వహించారు. అలాగే స్థానిక శ్రీ రామలింగేశ్వరాలయం, పాతపేట శ్రీ కోదండరామాలయం, మోడల్ కాలనీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద నవమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేతాజీ రోడ్‌లో శ్రీరామ యువజన సేవా సంఘం అధ్వర్యంలో సీతారాముల చిత్రపటానికి పూజలు చేసి భక్తులకు పానకం, పెసరపప్పు, మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే స్థానిక ప్యాలస్ రోడ్‌లో వాల్మీకి సంఘం అధ్వర్యంలో భక్తులకు పెసరపప్పు, పానకం అందించారు.

## ఘనంగా శ్రీరామనవమి పండగ

శాంతిపురం, మార్చి 30 ప్రభాతవార్త :



శాంతిపురం మండలంలో శ్రీరామ నవమి పండగను ఘనంగా జరుపు కున్నారు. రాళ్లబూదుగూరు శ్రీ కోదండరామాలయం, తుమ్మిశి రామా లయం, తుమ్మిశి, సోగడబల్ల, కోతిగుట్ల పల్లిలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణోత్సవం, అన్నదానం జరిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వాడవాడలా నవమి వేడుకలు

గంగాధర నెల్లూరు, మార్చి 30 ప్రభాతవార్త :



మండలంలోని పల్లెల్లో వున్న శ్రీ రామ భజన మందిరాలలో శ్ర రామ నవమి వేడుకలను గురువారం కోలహలంగా జరుపుకున్నారు. కొన్ని గ్రామాలలో 9 రోజుల పాటు మూడు రోజుల పాటు ఈ వేడుకలను రామ భజనలు కోలాటాలు, చెక్కభజనలు, హరికథలు,రామకోటి లాంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం రాత్రి ప్రత్యేక పుష్ప పల్లకిపై స్వామి అమ్మవార్ల ఊరేగింపు మంగళవాయిద్యాలు బాణాసంచా పేళ్లల మధ్య గ్రామాలలో ఊరేగించారు.

## ఎన్టీఆర్ కీర్తి అజరామరం, సేవలు అవని శోభితం

– సీనియర్ సివిల్ జడ్జీ డా.ఐ. కరుణకుమార్

చిత్తూరురూరల్, మార్చి 30 ప్రభాతవార్త:



తెలుగుజాతిని ఎన్టీరామారావు ప్రభావితం చేసిన వైనం అవని శోభితమని, ఎన్టీఆర్‌కు 'భారతరత్న' పురస్కారం ఇవ్వాలని ఉమ్మడిజిల్లాల న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్‌జడ్జీ డా.ఐ.కరుణ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని రెడ్డిభవన్ నందు భారతీయ తెలుగు రచయితల సమాఖ్య ఆద్వర్యంలో వ్యవస్థాపకులు మద్రిపూడి దేవేంద్రరావు నేతృత్వంలో యుగపురుషుడు ఎన్టీఆర్ శతవసంతోత్సవ వేడుకల సందర్భంగా 'తెలుగు అక్షరం– తెలుగు వారి ఆత్మగౌరవం' అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. అలాగే డా.సి. తులసీనెహ్రూ సేవలకు స్త్రీ శిరోరత్న, డా.నందిపాటి చక్రపాణిలకు సేవారాజన్మణి బిరుదును సమాఖ్యఆద్వర్యంలో ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య జాతీయ అధ్యక్షులు డా.సి.నారాయణస్వామి, ప్రముఖ అవదాని ఆముదాల మురళీ, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు డా.జి.శాంతకుమారి, కొఠారి వెంకటరత్నం, డా.కె.సి.లావణ్య, డా.సోము ఉమాపతి, డా.వి.రఘుపతి, గొడుగుచింత గోవిందయ్య, తోట గోవిందన్, ఎం.నేతాజీ, కె.ఎం.బాలరాజు, మొగిలయ్యశెట్టి, కె.హరిప్రసాద్‌రెడ్డి, సి.ఆర్. నరేష్, సి.ఆర్.జ్ఞానశేఖర్‌రెడ్డి, బాల, నాగచందు, రెడ్డెప్ప, రోహిత్‌కుమార్, ఆర్.ప్రభుతేజలతో పాటు తెలుగుభాషాబిమానులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వేసవి క్రీడా శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

– జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సిఇఓ డా.మురళీకృష్ణ

చిత్తూరురూరల్, మార్చి 30 ప్రభాతవార్త:

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, తిరుపతి ఆద్వర్యంలో మేనెల 1నుంచి 31వ తేది వరకు వేసవి క్రీడా శిబిరాలు నిర్వహించనున్నట్లు, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని క్రీడాప్రాధికార సంస్థ సిఇఓ డా.వి.మురళీక్రిష్ణ, చీఫ్ కోచ్ సయ్యద్‌సాహెబ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని 50 వేసవి క్రీడాశిక్షణ శిబిరాల్లో 16 సంవత్సరాల లోపు బాలబాలికలకు శిక్షణ ఇవ్వబడుతుం దన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాశిక్షకులు, సీనియర్ క్రీడాకారులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు ఏప్రిల్ 1నుంచి 5వ తేదిలోగా పూర్తి వివరాలతో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9440418340, 9177796469ను సంప్రదించాలని కోరారు.

## భక్తి శ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు

సదుం,మార్చి30 ప్రభాతవార్త :



మండల పరిధిలోని పలు రామాలయాలలో గురువారం శ్రీరామనవమి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నడిగడ్డ, మతుకువారిపల్లె,పెడకంటివారిపల్లె, యర్రాతివారిపల్లె, తాటిగుంటపాలెం, కొత్తపల్లె శ్రీవారిపాదక్షేత్రం గ్రామాలలోని రామాలయాలలో ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామి వారి ప్రసాదాలు, ముత్యాల తలంబ్రాలు పంపిణీ చేశారు. ఊటుపల్లె పంచాయతీ పుట్టావారిపల్లె కోదండరామాలయంలో సీతారాములను మేళాతాళాలు, పిల్లనగ్రోవులు, కోలాటాల నడుమ ఊరేగించారు.

## ఎంకామ్ ఫలితాల్లో ఐఆర్‌ఎం విద్యార్థుల విజయభేరి

కుప్పం, మార్చి 30 ప్రభతావార్త :



ఎంకామ్ ఫస్టియర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక ఐఆర్‌ఎం కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల ఛైర్మన్ బిఎం దయానిధి తెలిపారు. ఎంకామ్‌లో సాదియా తబస్సుం (421), ఫైజా (411), ఊహ (408), ధరణి (407), జయంతి (404), కవిత (403), శివపుత్ర (374) మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఛైర్మన్ అభినందించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వైభవంగా సీతారాములవారి కల్యాణం

కోట, మార్చి 30 ప్రభాతవార్త :

కోట మండలంలోని పలు ఆలయాల్లో గురువారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీసీతారాముల వారికి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సవం నిర్వహించారు. కోటలోని కోదండరామస్వామి ఆలయంలో కల్యాణోత్సవంలో పలువురు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కోటలోని సాయిబాబా మందిరంలో శ్రీరామనవమి మహోత్సవాలను ఛైర్మన్ సారంగం విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సుప్రభాతసేవ, హారతి, అభిషేకాలు, పారాయణం, భజనలు, సంకీర్తనల అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. చందనోత్సవం, సత్సంగం, పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు.

## సచివాలయ నిర్మాణంపై లోకాయుక్తకు ఫిర్యాదు

కోట, మార్చి 30 ప్రభాతవార్త :

కోట మండలం వెంకన్నపాలెం పంచాయతీ పరిధిలోని దేవాలయ భూముల్లో సచివాలయ నిర్మాణంపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు తిరుపతి జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు చెప్పారు. ఆ మేరకు గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సర్వే నంబర్ 1303లో 1.60 సెంట్లు భూమి కోటమ్మ తల్లి దేవస్థానం తరపున రిజిస్టర్ అయి ఉందన్నారు. ఈ భూమిలో కోనేరు నిర్మించబడి ఉందని, ఉత్సవాల సమయంలో అమ్మవారికి తెప్పోత్సవ నిర్వహణకు, వేసవిలో పశువుల దాహార్తి తీర్చడానికి అనువుగా ఉన్న ఈ కోనేరు స్థలంలో సచివాలయం, ఆర్‌బికెలను నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని తెలిపారు. ఆ మేరకు ఈ విషయంపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు పనబాక కోటేశ్వరరావు తెలిపారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

కోట, మార్చి 30 ప్రభాతవార్త :

కోటలోని అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు, పెన్నులను కోటమ్మ తల్లి ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. గురువారం అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూలులో 10వ తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పుల్లారావు, అంబేడ్కర్ యూత్ సభ్యులు మీజూరు చంద్రప్రకాష్, కిషోర్, గోపి, రమేష్, శివశంకర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా శ్రీసీతారామ కల్యాణం

సూళ్లూరుపేట, మార్చి 30 ప్రభాతవార్త :

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీబాలాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం శ్రీసీతారామ కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని జరిపించి భక్తులకు సీతారామ సమేత దర్శన భాగ్యం కల్పించారు. పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు శ్రీరామనామ స్మరణతో కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. దేవస్థానం ఛైర్మన్ అయితా శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు దివి లక్ష్మీనారాయణ సారథ్యంలో కల్యాణాన్ని జరిపారు. శ్రీషిరిడీ సాయిబాబా ఆలయాల్లోను శ్రీరామనవమిని పురస్కరించుకొని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

## బిజేపి పార్టికి పతనం తప్పదు

–కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి

వెంకటగిరి, మార్చి30 ప్రభాతవార్త :



2024 సంవత్సరంతో బిజేపి పార్టికి పతనం తప్పదని కాంగ్రెస్ పార్టి నియోజవర్గ ఇన్‌చార్జి పంటా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పార్లమెంట్ సభ్యత్వం ను ఒడి రాహుల్ గాంధీని సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని కాంగ్రెస్ పార్టి నాయకులు పోలేరమ్మ ఆలయం కూడలి వద్ద ధార్నా చేశారు, ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు,గోపాల్ తదితరులు పాల్గొన్నారు,

## వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు వరం లాంటిది

ఓజిలి, మార్చి 30 ప్రభాతవార్త :



మహిళాధికారతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైసీపీ సీనియర్ నాయకులు ముమ్మడి సుబ్బారావు యాదవ్, బట్టా అనిల్‌కుమార్ యాదవ్, బట్టా పృధ్వీ కృష్ణ యాదవ్ అన్నారు. వారు మాట్లాడుతూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నియోజకవర్గంలో అభివృద్ధి చేయడంలో ముందుంటారని అన్నారు. రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. సీఎం జగన్ ప్రవేశపెడుతున్న అనేక పథకాలలో మహిళలకు ఎంతో ప్రాధాన్యత కల్పిస్తున్నారని గుర్తు చేశారు.

## పోలీసు వాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

– నాయుడుపేట సీఐకి తీవ్ర గాయాలు

నాయుడుపేట రూరల్, మార్చి 30 ప్రభాతవార్త



నాయుడుపేటలో ఓ ట్రాక్టర్ పోలీసు వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో సీఐ తీవ్రంగా గాయపడ్డారు. నాయుడుపేట సీఐ ప్రభాకర్ విధుల నిమిత్తం గురువారం ఉదయం మండల పరిధిలోని పండ్లూరు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన ట్రాక్టర్ సీఐ ప్రయాణిస్తున్న జీపును ఢీకొంది. ఈ ప్రమాదంలో జీపు ముందు భాగం దెబ్బతిన్నది. సీఐ ప్రభాకర్ సహా డ్రైవర్ కూడా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన సీఐ, డ్రైవర్‌లను నాయుడుపేట ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని చెన్నైకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకున్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నాయుడుపేట హాస్పిటల్ వద్దకు చేరుకొని సీఐని పరామర్శించారు.

## తడ ఆలయాలలో శ్రీరామనవమి వేడుకలు

తడ, మార్చి 30 ప్రభాతవార్త :

తడ మండలంలోని పలు వైష్ణవాలయాలలో శ్రీరామనవమి వేడుకలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. బోడిలింగాల పాడు, పన్నంగాడులలోని ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు చినమాం బట్టు, వేనాడు, చేనిగుంట, తడ తదితర చోట్ల శ్రీరామనవమి పూజలు జరిపారు. అండగుండల, తడకండ్రిగలలోనూ సాయిబాబా ఆలయాలలో సాయిరామనవమి జరుపుకున్నారు. ఉదయం నుంచే భక్తులు వైష్ణవాలయాలకు పెద్దసంఖ్యలో చేరుకొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## పూడిలో ఆక్రమణల తొలగింపు

తడ, మార్చి 30 ప్రభాతవార్త :

తడ మండలం పూడి గ్రామ పంచాయతీ పరిధిలో ఆక్రమణలను తొలగించినట్లు తహశీల్దార్ బి.రామయ్య తెలిపారు. అక్కడ ఇటీవల కాలువ పోరంబోకు స్థలంలో కొందరు ఆక్రమణలు చేశారని ముందుగా నోటీసులు ఇచ్చి అనంతరం వాటిని తొలగించినట్లు చెప్పారు. తహశీల్దార్‌తో పాటు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, విఆర్ఓలు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ ప్రారంభం

గుడిపాల, మార్చి 30 ప్రభాతవార్త:

గుడిపాల మండల తెలుగుదేశం అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు మధ్య సుబ్రమణ్యంనాయుడు పుట్టినరోజు వేడుకలను ఘనంగా చేసుకొన్నారు. ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలతల సమక్షంలో సుబ్రమణ్యం నాయుడు భారీ కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచి పెట్టారు. గుడిపాలలో గురువారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు చొరవతో అన్న క్యాంటీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలత, తెలుగుదేశం నాయకులు కాజూరు బాలాజీ, వసంత్‌కుమార్, సురేంద్రకుమార్, అనిల్‌కుమార్, చంద్రమోహన్, హేమాద్రినాయుడు, మురళి, కిట్టు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆశీర్వాదాలు ఎప్పటికీ మర్చిపోను

– గూడూరు ఎమ్మెల్యే డా॥ వెలగపల్లి వరప్రసాద్ రావు

గూడూరు, మార్చి 30, ప్రభాతవార్త :



గూడూరు నియోజకవర్గ ప్రజలకు ముందుగా శ్రీరామనవమి శుభా కాంక్షలను గూడూరు శాసనస భ్యులు డా. వెలగపల్లి వరప్రసాద్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఆశీర్వదించి, అత్యధిక మెజారి టీతో ఎమ్మెల్యేగా గెలిపించిన గూడూరు నియోజకవర్గ ప్రజల ఆదరణ మర్చిపోలేదని అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి నన్ను నమ్మి గూడూరు ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చినా, గూడూరు నియోజకవర్గంలోని వైఎస్ఆర్‌సిపి పార్టీ నాయకులు , కార్యకర్తలు నాకు అన్ని విధల సహాయం చేసినా కూడా చివరికి గెలిపించింది నా గూడూరు నియోజకవర్గ ప్రజలే అని అన్నారు. ఎప్పటికీ మీ రుణం తీర్చుకోలేనిది అన్నారు. దానికి కృతజ్ఞతగా నేను కూడా గూడూరు ప్రజలకు కొన్ని పనులు చేయాలని ఆయన అన్నారు. గూడూరులోకొన్ని ముఖ్యమైన పనులు ఉన్నాయని వాటిని పూర్తి చేయాలని గూడూరు ప్రజలు కోరడంతో ఆ పనులన్నిటినీ మొదలు పెట్టి దాదాపుగా పూర్తి చేసినట్లు తెలిపారు. వాటిని త్వరలోనే ప్రారంభించబోతున్నట్లు గూడూరు ఎమ్మెల్యే తెలియజేసారు. తాళంకి రమణయ్య, నాసిన భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

## శ్రీరామ నవమి వేడుకలు

వెంకటగిరి, మార్చి30 ప్రభాతవార్త :

పట్టణం,గ్రామాల్లో ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి. రాముల వారి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. 11 రోజుల పాటు నవమివేడుకలను నిర్వహిస్తాను. కాగ శరిడి సాయిబాబా మందిరంలో శ్రీరామ నవమి, అన్నదానం నిర్వహించారు. మందిరం నిర్వాహక కమిటి ఛైర్మన్ తిరుమల శెట్టి వల్లభదాస్ తదితరులు అన్న దానం కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు

గుడిపాల, మార్చి 30 ప్రభాతవార్త:

ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు చేపట్టాలని ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్ళు వెంకటేష్, పరమేశ్వర్‌లు పేర్కొన్నారు. మద్యం డిపో మేనేజర్ దయాసాగర్ ఆదేశాల మేరకు గురువారం వీరు రెట్టగుంట ప్రభుత్వ మద్యం షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఎంఆర్‌పి ధరల కంటే ఎక్కువ ధరలకు మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

## వైకాపా మండల కన్వీనర్‌గా తులసీ యాదవ్

పాలసముద్రం, మార్చి 30 ప్రభాతవార్త:



పాలసముద్రం మండల వైకాపా కన్వీనర్‌గా తులసీయాదవ్ నియమితు లయ్యారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో నూతన వైకాపా కన్వీనర్లను డిప్యూటీ సిఎం నారాయణ స్వామి గురువారం ప్రకటించారు. ఈ మేరకు గతంలో పాలసముద్రం మండల వైకాపా కన్వీనర్‌గా సుబ్రమ ణ్యంరెడ్డి వుండగా ఆయన స్థానంలో ప్రస్తుతం తులసీ యాదవ్‌ను నూతనం గా నియమించినట్లు డిప్యూటీ సిఎం నారాయణస్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన మండల వైకాపా కన్వీనర్‌గా ఎంపికైన తులసీయాదవ్ మాట్లాడుతూ మండల పరిధిలో నాయకుల సహకారంతో కార్యకర్తలను ఏకతాటిపై తీసుకువచ్చి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అన్బుగలన్, మాజీ కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, సీనియర్ నాయకురాలు ఇందిరమ్మ, సుందరరాజు, సర్పంచ్ గాలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మున్సిపల్ కార్యాలయంలో వైఎస్ఆర్ ఆసరా

శ్రీకాళహస్తి, మార్చి 30 ప్రభాతవార్త :

పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో ఉదయం 10గంటలకు ఎంపి మద్దెలగురుమూర్తి, ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డిల ఆధ్వర్యంలో అక్క చెల్లెమ్మలకు జగనన్న వరాల జల్లు వైఎస్ఆర్ ఆసరా సంబరాలు 2023 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బాలాజీనాయక్ తెలిపారు. వైఎస్ఆర్ ఆసరా సంబరాలకు మహిళా సంఘాల సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

## గుడిమల్లం ఆలయ దర్శన వేళలు మార్పు

శ్రీకాళహస్తిరూరల్, మార్చి 30 ప్రభాతవార్త :



ఏర్పేడుమండలం గుడిమల్లాంలో వెలసిన పరశురామేశ్వరాలయం దర్శన వేళలను పొడిగిస్తూ పురావస్తు శాఖ నిర్ణయం తీసుకున్నారు.ఈ మేరకు గురువారం సమాచారం అందింది. గతంలో గుడిమల్లం ఆలయం సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే దర్శనం ఉండేది. అయితే చారిత్రక ప్రసిద్ధి చెందిన గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరాలయానికి టూరిస్టుల తాకిడి పెరిగింది. ఆలయానికి సంబందించి పాలకులు విస్తృత ప్రచారం నిర్వహించటంతో టూరిస్టుల తాకిడి గణనీయంగా పెరిగింది. ఈ విషయాన్ని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనంరెడ్డి దృష్టికి ధర్మకర్తల మండలి చైర్మెన్ నరసింహాయాదవ్ తీసుకురావటంతో ఆయన స్పందించి తిరుపతి పార్లమెంటు సభ్యుడు డాక్టర్ గురుమూర్తి దృష్టికి తెచ్చి పురావస్తు శాఖ అధికారులతో చర్చించారు.ఆయన చర్చల ఫలితంగా దర్శన వేళలను సాయంత్రం ఆరుగంటల నుంచి రాత్రి 8గంటల వరకు పెంచారు.ఈ మేరకు పురావస్తుశాఖ అధికారులు ఉత్తర్వులు జారి చేసారు. ఈ మేరకు ఎంపి గురుమూర్తి మంత్రి కిషన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## వడ్డీరాయితీతో గణనీయంగా పన్నుల వసూళ్ళు

శ్రీకాళహస్తి,మార్చి 30 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో రెవెన్యూ సిబ్బంది పరుగులు తీస్తూ పన్నులు వసూళ్లు చేస్తున్నారు. ప్రభుత్వం వడ్డీరాయితి ప్రకటించటంతో రూ.1.2కోట్లు వసూలు చేసారు. అంటే దీని మీద వడ్డీ రూ.2కోట్లు ఉంటుందని కమిషనర్ బి. బాలాజి నాయక్ వివరించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటి పన్నుల డిమాండ్ 8.81కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.6.79కోట్లు వసూలు చేసినట్లు కమిషనర్ బాలాజి నాయక్ వివరించారు. అంటే 77శాతం పన్నులు వసూళ్లు చేసినట్లు ఆయన వివరించారు. పన్నుల వసూళ్ళకు తమ సిబ్బంది రేయింబవళ్ళు పరుగులు తీస్తున్నారని అలాగే వార్డుల్లో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది సహాకారం కూడా బాగుందన్నారు. జనాన్ని చైతన్య వంతుల్ని చేయటంలోనూ, అలాగే పన్నుల వసూళ్ళకు సంబంధించి చొరవ చూపారని అభినందించారు.

## వేటకు వెళ్ళి కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి!

ఐరాల, మార్చి 23 ప్రభాతవార్త:

వేటకు వెళ్ళి అడవి పందుల కోసం లాగిన కరెంట్ తీగలకు తగులుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రం ఐరాలలో గురువారం వెలుగుచూసింది. మండలంలోని బెస్తపల్లెకు చెందిన సుబ్రమణ్యం(51), శ్రీనవాసులు, నందయ్య, వడ్డిపల్లెకు చెందిన రెడ్డెప్ప, వీరభద్ర, సుబ్రమణ్యం తదితరులు మంగళవారం రాత్రి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వెనుకవైపున వున్న అటవీ ప్రాంతంలో వేటకు వెళ్ళి అడవి పందుల కోసం విద్యుత్ తీగలను అమర్చారు. ఈనేపథ్యంలో కొంత సమయానికి శబ్దం రావడంతో సుబ్రమణ్యం పంది విద్యుత్ తీగలకు తగిలిందని పరిశీలించేందకు వెళ్ళి తాము అమర్చిన విద్యుత్ తీగలకు తగులుకుని విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. ఈవిషయాన్ని గమనించిన వెంట వెళ్ళిన వారు సుబ్రమణ్యం మృత దేహాన్ని సుమారు రెండు కిలోమీటర్లు దూరంల తీసుకువెళ్ళి అటవీ ప్రాంతంలో పడేసి వెళ్ళి పోయారు. దీనితో సుబ్రమణ్యం కల్పించడం లేదని ఆయన కుమారుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు సుబ్రమణ్యం మృత దేహాన్ని గురువారం కనుగొన్నారు. ఈమేరకు శవాన్ని పోస్టుమార్టంకు తరలించి కల్లూరు సీఐ ఆశీర్వాదం, ఐరాల ఎస్సై వెంకటేశ్వర్లు దర్యాప్తు చేస్తున్నారు.

## హనుమంతు వాహనంపై ఊరేగిన సీతారాములు

కాణిపాకం, మార్చి 30 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీసీతా లక్ష్మణ సమేత కోదండ రాముల వారు హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీవీరంజనేయ స్వామి ఆలయంలో ఉదయం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఉదయం స్వామివారిక స్నపన తిరుమంజనం, కళ్యాణోత్సవం నిర్వహించగా రాత్రి హనుమంత వామన సేవను నిర్వహించారు. ఈసందర భంగా అలంకృతులపై స్వామి, అమ్మవార్లను హనుమంతు వాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీదుల గుండా ఘనంగ ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

విజయపురం, మార్చి 30 ప్రభాతవార్త :



మండలంలో గురువారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా మండలంలోని చిన్న ఆలపాకంలో సీతారాములకు, జగన్నాధపురంలో శ్రీరామ నామ క్షేత్రంలో సీతారాములను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహకులు సుగుణ, రామ్‌ప్రసాద్‌స్వామి పలువురు భక్తులు పాల్గొన్నారు.

## మోటారుకు మరమ్మతు చేయండి

విజయపురం, మార్చి 30 ప్రభాతవార్త :



మండలంలోని పాతార్కాడులో మంచినీరు సరఫరా చేసే మోటారు మరమ్మతుకు గురైందని గ్రామస్తులు తెలిపారు. మరమ్మతుకు గురై నెల రోజులవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని దీని వల్ల మంచి నీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మోటారుకు మరమ్మతు నిర్వహించాలని కోరారు.

## శివయ్యసేవలో హోంగార్డుల ఆర్ఐ

శ్రీకాళహస్తి, మార్చి 30 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయానికి గురువారం హోంగార్డుల ఆర్ఐ శ్రీనివాసులు విచ్చేశారు. ఆయనకు ఆలయంలో విధులు నిర్వహించే హోంగార్డులు, ఆలయాధికారులు స్వాగతం పలికారు. తొలుత ఆయన హోంగార్డుల పెరేడ్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో స్వామిఅమ్మవార్ల ప్రత్యేకదర్శనం చేసుకుని పూజలు నిర్వహించుకున్నారు. ఈసందర్బంగా ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధివద్ద ఆయనకు ఆలయంలోని స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలతోపాటు హోంగార్డులు మురుగ, యోగానంద, సిఆర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారాముల కళ్యాణం

చిల్లకూరు, మార్చి 30 ప్రభాతవార్త



మండల పరిధిలోని తమ్మిన పట్టణం గ్రామంలో ఉన్న శ్రీకోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శ్రీరామనవమి సందర్బంగా ఉదయం స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఇఒ కోవూరు జనార్దన్‌రెడ్డి తోపాటు ఆలయ చైర్మన్ యరటపల్లి సాయి పృద్వీరెడ్డి దంపతులుతో పాటు కృష్ణపట్నం పోర్టు సిఇఒ జెజెరావు, మాజీ ఎఎంసి చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహారించారు. అదే విధంగా మండలంలోని వరగలి, ఏరూరు, కడివేడు, చిల్లకూరు,పున్నపువారిపాళెం గ్రామాలలో కూడా రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో తమ్మిన పట్టణం విఆర్ఒ బాలాజీ దంపతులు,గ్రామ సర్పంచ్ నెల్లిపూడి సుబ్రమణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.ఈకార్యక్రమం యరటపల్లి శరణ్‌రెడ్డి ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

## వైభవంగా శ్రీరామనవమి ఉత్సవాలు

బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 30 ప్రభాతవార్త:



శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మండలంలోని శ్రీరామ ఆంజనేయ, శ్రీ వెంకటేశ్వరస్వామి, పలు దేవత ఆలయాల్లో విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు ఘనంగా ఉత్సవ వేడుకలు జరుపుకున్నారు. పలమాలలోని శ్రీరామాంజనేయ గుడిలోస్పంచ్ జొన్నల వెంకట రమణమ్మ, గోపాల్‌రెడ్డి, పలువురు గ్రామస్థులు శ్రీరామనవమి వేడుక పూజలను నిర్వహించి ప్రారంభించారు. మండలంలోని ప్రతి గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు ఘనంగా నిర్వహించారు.

## వైభవంగా శ్రీరామనవమి ఉత్సవాలు

రేణిగుంట, మార్చి 30 ప్రభాతవార్త:



రేణిగుంట పట్టణం, మండలంలోని దేవాలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ భక్తివత్తులను చాటుకున్నారు. రామనామ స్మరణతో దేవాలయాల ప్రాంగణాలు మారుమోగాయి. జీఎం వీధిలోని సాయిబాబా గుడిలో సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. భజన గుడి వీధిలోని రామ మందిరంలో విశేష పూజలతోపాటు అనేక అభిషేకాలు నిర్వహించారు. గుత్తివారిపల్లి శ్రీ కోదండరామస్వామి ఆలయాన్నిఎమ్మెల్సీ డా. సిపాయి సుబ్రహ్మణ్యం, రేణిగుంట మండల వైసీపీ ఇన్‌చార్జి పవిత్రరెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ మంజుల, సింగిల్‌విండో చైర్మన్ గణేష్‌రెడ్డి, మునిరెడ్డి, వైసీపీసీ సీనియర్ నేతలు దయాకర్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, ధనంజయులు, ప్రకాష్, తదితరులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉండగా బియ్యపు పవిత్రరెడ్డి భజన గుడి వీధిలోని రామమందిరాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు ప్రత్యేక స్వాగతం పలికారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్‌గా చిరంజీవి

రేణిగుంట, మార్చి 30 ప్రభాతవార్త:



కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్‌గా రేణిగుంటకు చెందిన చిరంజీవిని నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ చైర్మన్ ముల్లా వెంకట్రావు నియామక పత్రం అందజేశారు. తనకు పదవి ఇచ్చిన వెంకట్రావుకు, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అజయ్‌సింగ్ యాదవ్, గిడుగు రుద్రరాజు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన రేణిగుంట గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. విలేకరులతో మాట్లాడుతఊ గ్రామ స్థాయిలో పార్టీలు బలోపేతం చేస్తానని తెలిపారు.

## వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు

పుత్తూరురూరల్, మార్చి 30 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణం, మండల పరిధిలోని శ్రీరాముని ఆలయాల్లో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బజారు వీధిలో వెలసిన శ్రీరాముని ఆలయం అలాగే మండల పరిధిలోని కనకంపాళెం, వేపగుంట, కైలాసపురం గ్రామాల్లో శ్రీరాముని కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేపగుంటలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## భక్తి శ్రద్ధలతో ప్రసాదాల వితరణ

శ్రీకాళహస్తి, మార్చి 30 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న పట్టాభిరామస్వామి ఆలయంలో గురువారం శ్రీరామనవమి సందర్బంగా కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.వచ్చిన భక్తులకు ఆలయం తరఫున ప్రసాదాలతో పాటు పసుపు కుంకుమ దారాలను అందించారు. ఈ సందర్బంగా వచ్చిన భక్తులకు ఆలయ చైర్మెన్ అంజూరుతారక శ్రీనివాసులు, ఆలయ ఇఓ వికె సాగర్‌బాబు బోర్డు సభ్యులు సుమతి, రమాప్రభ, లక్ష్మీ,మున్నారాయల్, జయశ్యాం తదితరులు వడ్డించి సేవలందించారు.

## రాహుల్ గాంధీని సస్పెండ్ చేయడంతో చీకటి రోజులు

శ్రీకాళహస్తి, మార్చి 30 ప్రభాతవార్త





రాహుల్ గాంధీని పార్లమెంటు సభ్యుడిగా సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికి చీకటిరోజులని కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధినేత, ఎంపి రాహుల్‌గాంధీపై లోక్‌సభ సభ్యత్వానికి అనర్హత వేటు వేయడం దేశ చరిత్రలోనే చీకటి అధ్యాయం అని ఆ పార్టీ పిసిసి రాష్ట్ర కార్యదర్శి యార్లపల్లి గోపి, పిసిసి ప్రతినిధులు పి.శ్రీనివాసులురెడ్డి, విఆర్.రావణలు పేర్కొన్నారు. ఈసందర్బంగా వీరు మాట్లాడుతూ రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ మాజీ ఎంపి డాక్టర్ చింతామోహన్ సూచనలతో గురువారం పట్టణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాబోవు 2024ఎన్నికల్లో రాహుల్‌గాంధీ సారధ్యంలో కాంగ్రెస్‌పార్టీ తప్పక విజయం సాధిస్తుందని, దేశానికి మంచిరోజులు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నరేంద్రబాబు, సమీరుల్లా, వెంకటేష్‌గౌడ్, శ్రీహరి, చిన్నయ్య, మణి, పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిహెచ్‌సికి వైద్యాధికారుల నియామకం

తొట్టంబేడు, మార్చి 30 ప్రభాతవార్త :



తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు వైద్యాదికారులను నియమించారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి వైద్యాధికారిణిగా డాక్టర్ తేజేశ్వరి ఉన్నారు. రెగ్యులర్ వైద్యాధికారులుగా తిరుపతికి చెందిన డాక్టర్ సాయిపూజ, రైల్వేకోడూరుకు చెందిన లహరిలను నియమించారు. అనంతరం వారు మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో వైద్యసేవలు మెరుగ్గా అందిస్తామని వివరించారు.

## పొయ్య గ్రామంలో కొనసాగుతున్న వైద్యశిబిరం

తొట్టంబేడు, మార్చి 30 ప్రభాతవార్త :



మండలంలోని పొయ్య గ్రామంలో రెండో రోజు వైద్యశిబిరం కొనసాగుతోంది. గ్రామంలో ప్రజలు జ్వరాలుతో ఇబ్బందులు పడుతుండడంతో వార్త దినపత్రికలో ప్రచురితం అయిన విషయం విదితమే. ఈనేపద్యంలోజ్వరాలుతగ్గేవరకు గ్రామంలోని సబ్‌సెంటర్‌లోనే వైద్యశిబిరాన్ని కొనసాగిస్తున్నారు. తొట్టంబేడు ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి డాక్టర్ తేజేశ్వరి, డాక్టర్ లహరి, డాక్టర్ మోహినిలతో పాటు స్పెషలిస్టు వైద్యుల ద్వారా వైద్యశిబిరాన్ని కొనసాగించారు. నేడు కూడా వైద్యశిబిరం కొనసాగనుంది.పిహెచ్ఎన్ సంపూర్ణమ్మ, భారతీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు తొట్టంబేడులో గడపగడపకు ఎంఎల్ఏ కార్యక్రమం

తొట్టంబేడు, మార్చి 30 ప్రభాతవార్త :

ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రజల వద్దకే ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి వస్తున్నారని ఎంపిడిఓ వి.తరుణాక్షరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా నేడు తొట్టంబేడు సచివాలయ పరిధిలోని తొట్టంబేడు, బిడి కాలనీ, శ్రీరామనగర్ కాలనీ, చెరుకురాగప్పనాయుడుకండ్రిగ గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోనున్నారు.

## గ్రామాల్లో రామమందిరాలు ఆధ్యాత్మికతకు నిలయాలు

తొట్టంబేడు, మార్చి 30 ప్రభాతవార్త :



మండలంలోని చిన్నకనపర్తి హరిజనవాడ రామాలయానికి రూ.1.05లక్షలు విలువచేసే స్వర్ణ పట్టాభిషేక సీతా రామలక్ష్మణుల చిత్రపటాన్ని మండల ఇన్‌ఛార్జి ఎంఎల్ఏ తనయ బియ్యపు పవిత్రారెడ్డి గ్రామస్తులకు అందించారు.ఈసందర్బంగా గ్రామస్తులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం పవిత్రారెడ్డిని సర్పంచ్ జి.విమల, ఎంపిటిసి సుబ్రమణ్యం,మణినాయుడు, ధనంజయులు, గోపి, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ప్రశంసాపత్రాలు

శ్రీకాళహస్తి, మార్చి 30 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరి 13 నుంచి 26వ తేదీ వరకు జరిగిన వార్షిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో సేవలందించిన భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఆలయ ఇఓ కెవి.సాగర్‌బాబు తమ కార్యాలయంలో ప్రశంసాపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో స్కౌట్స్ రాష్ట్ర మండలి మాజీ సభ్యులు టి.రమేష్‌బాబు, స్కౌట్స్ మాస్టర్ అజారుద్దీన్, లీడర్లు విద్యాసాగర్, సుబ్బు, ధనుష్, వెంకటేశ్వర్లు, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## శ్రీ కోదండ రామాలయాన్ని సందర్శించిన కలెక్టర్

తిరుపతిరూరల్, మార్చి30 ప్రభాతవార్త:



శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి తిరుపతి కోదండరామస్వామి ఆలయాన్ని సందర్శించారు. రామాలయంలో జరిగిన వేడుకలలో కలెక్టర్ వెంకట రమణారెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు.

## భక్తులకు పానకం,వడపప్పు పంపిణీ

తిరుపతిసిటీ,మార్చి 30ప్రభాతవార్త:



శ్రీరామనవమిపర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం కాపువీధిలోని సీతారాముల ఆలయంలో రాయలసీమ రంగస్థలి కళాసంస్థ చైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు పానకం,వడపప్పు పంపిణీ చేశారు. శ్రీరామనవమి పర్వదిన విశిష్టత, శ్రీరామచంద్రమూర్తి జీవిత విశేషాలు గురించి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో జైశ్రీరామ్ నినాదాలతో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యంయాదవ్, మల్లారపురవిప్రసాద్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కవిత, రాజశేఖర్, దిలీప్, కెఎన్ రాజా తదితరులు పాల్గొన్నారు.

## కోదండ రాములవారి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం

చంద్రగిరి, మార్చి 30 ప్రభాతవార్త:



టిటిడి అనుబంధ శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. చంద్రగిరిలోని చారిత్రాత్మక పురాతన శ్రీకోదండరామ స్వామి వారి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్స వాలను గురువారం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉదయం మేష లగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కంకణభట్టార్ శ్రీనివాస భట్టార్ ఆధ్వర్యంలో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, భక్తుల రామనామ స్మరణల నడుమ ధ్వజపటాన్ని ధ్వజస్థంభంపై అధిష్టింపజేశారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు శ్రీసీతారాముల వారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ పార్థసారధి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ సేవలకు అభినందనలు

చంద్రగిరి, మార్చి 30 ప్రభాతవార్త:



ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ మామండూరు గ్రామస్థులకు అందించిన సేవలను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుకుమార్ అభినదించారు. చంద్రగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (అగరాల) ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లు మామండూరులో వారం రోజుల ఎన్.ఎస్.ఎస్. క్యాంపు గురువారం ముగిసింది. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏడు రోజుల ప్రత్యేక శిబిరాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో సహకరించిన గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ షేక్ ఫజిల్లా అమ్జాద్ మాట్లాడుతూ మామండూరు గ్రామాన్ని దత్తత తీసుకుని ప్రజల పారిశుధ్యం, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్.సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ వాలంటీర్స్ నిర్వహించిన 15-29 వయస్సు గల వారిలో విద్య, సాధారణ ఉద్యోగం లేని వ్యక్తులను సర్వే చేయడంలో సహకరించిన సర్పంచ్‌కి, ప్రజలకు కృతజ్ఞతలు తలిపారు. ఈ కార్యక్రమంలో మునికృష్ణారెడ్డి, అధ్యాపకులు శంకర్, కృష్ణవేణి,ఆర్.గోవర్ధన్‌నాయుడు,మోహన్‌బాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా శ్రీసీతారాముల కల్యాణం

చంద్రగిరి, మార్చి 30 ప్రభాతవార్త:



శ్రీసీతారాముల కల్యాణ వైభోగం కన్నుల పండువగా జరిగింది. మండల పరిధిలోని కొటాల గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మార్చి 22 శోభకృత్ నామ సంవత్సరం తెలుగు నూతన సంవత్సరాధి ఉగాది రోజు నుండి 9 రోజుల పాటు ఆలయ ప్రధాన అర్చకులు తనూజ్ విష్ణువర్ధన్, ఆలయ అర్చకులు పార్ధ ఆధ్వర్యంలో గ్రామస్థులు శ్రీరామనవమి వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం నుండి భగవతారాధన, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మూలవిరాట్టులకు పంచామృతస్నపనము నిర్వహించారు. శ్రీరామచంద్రుని పాదుకలకు, నూతన ఆభరణములకు కళ్యాణోత్సవమంగళద్రవ్యముల గ్రామ ప్రదక్షిణం గావించారు. వేదమంత్రోచ్చారణల నడుమ కళ్యాణోత్సవ ఘట్టాన్ని ప్రారంభించిన అర్చకులు మధ్యాహ్నం శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. తదుపరి భక్తులకు అన్నదానం జరిపించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీసీతారాముల వారి ఉత్సవమూర్తులను విశేష అలంకరణ గావించి గ్రామోత్సవం నిర్వహించారు.

## చలివేంద్రం ప్రారంభం

తిరుపతి కార్పొరేషన్, మార్చి 30 ప్రభాతవార్త :



శ్రీనామ నవమి సందర్భంగా సిద్ది వినాయక టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభంకు ముఖ్య అతిధిగా డిప్యూటి మేయర్ ముద్రనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పానకం, మజ్జిగ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె బాబు, కార్పొరేటర్ కొటూరు ఆంజనేయులు, యూనియన్ నాయకులు ఇస్మాయిల్ భాయ్, వెంకటేశ్వర్లు, నజీర్, ఓనర్లు డ్రైవర్లు పాల్గొన్నారు.

## కల్యాణ వెంకన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

చంద్రగిరి, మార్చి 30 ప్రభాతవార్త:



కల్యాణ వెంకన్నను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత దర్శించుకున్నారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారిని గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత తమ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ టి.వెంకటస్వామి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, జమేధర్ చిరంజీవులు స్వామి వారి దర్శన ఏర్పాట్లు గావించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తిరుమల వాసుల జైశ్రీరామ్ నామం

-ఎస్ఎంసి పార్కులో వైభవంగా శ్రీరామనవమి

తిరుమల,మార్చి 30ప్రభాతవార్తప్రతినిధి:



కొండపై నివాసముంటున్న స్థానికులు, దుకాణాదారులు, వ్యాపారులు స్థానికంగా శ్రీరామనవమి పర్వ దినాన్ని గురువారం ఉదయం వైభవంగా జరుపుకున్నారు. ఎస్ఎంసి కూడలిలోని పార్కులో శ్రీరామచంద్రమూర్తి చిత్రపటం ఉంచి వారధి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరామునికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకం, వడపప్పు,ప్రసాద వితరణ చేశారు. జై శ్రీరామ్ నామంతో మార్మోగింది.

## చంద్రప్రభ వాహనంపై కరకంఠేశ్వరుడు

నగరి, మార్చి 30 ప్రభాతవార్త:



పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కరకంఠేశ్వర స్వామిని చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. నగరి మర్చంట్స్ అసోసియేషన్ వారు ఉత్సవాలకు ఉభయదారులుగా వ్యవహరించారు.ఆలయంలో అభిషేక, అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో ఊరేగింపుగా వచ్చిన స్వామివాకి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చి భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తసుబ్రహ్మణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య!

నగరి, మార్చి 30 ప్రభాతవార్త:



మున్సిపల్ పరిధి కీళపట్టు హైవే బ్రిడ్జి సమీపం పొదళ్ళలో గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల మేరకు.. కాళకృత్యాలు తీర్చుకోవడానికి ఏటి గట్టున పొదళ్ళ వద్దకు వెళ్లిన వారు మృతదేహం చెట్టుకు వేలాడుతూ ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

# వైద్యరంగంలో పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలి

- ఎపి మెడికల్ కౌన్సిల్ డా॥ సుబ్బారెడ్డి
- పిఇఎస్ వైద్య కళాశాలలో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్

కుప్పం, మార్చి 30 ప్రభాతవార్త :

వైద్య రంగంలో పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎపి మెడికల్ కౌన్సిల్‌కు చెందిన డా॥ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. కుప్పం పిఇఎస్ వైద్యకళాశాలలో వైద్య,అనుబంధ విభాగాలకు చెందిన యుజి, పిజి విద్యార్థుల కోసం రాష్ట్రస్థాయిలో పరిశోధన విధానంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు ఎపి మెడికల్ కౌన్సిల్ ఆరు క్రెడిట్ అవర్స్‌ను ప్రదానం చేసింది. వివిధ విభాగాలకు చెందిన 156మంది వైద్య విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో శిక్షణ పొందారు. పరిశోధన చేసేందుకు అవసరమైన సంభావిత స్పష్టత, ఆచరణాత్మకమైన నైపుణ్యంపై దృష్టి సారించాలని డా॥ సుబ్బారెడ్డి సూచించారు. నేషనల్ మెడికల్ కమీషన్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్



నిర్దేశించిన తప్పనిసరి పాఠ్యాంశాలు మరియు వృత్తిపరమైన అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచా ్చరు. పిఇఎస్ మెడికల్ డైరెక్టర్ డా॥ సురేష్ కృష్ణమూర్తి ఈ సదస్సుకు ప్రోయాక్టివ్‌గా వ్యవహరిం చారు. డీన్,ప్రిన్సిపాల్ డా॥ కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు తమ పి.జి. డిగ్రీలు పూర్తి చేసేందుకు సంబంధిత పరిశోధనలు చేపట్టి వాటిని ప్రచురించేలా శిక్షణ కల్పించేందుకు ఈవర్క్‌షాప్ దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో రీసెర్చ్ కమిటీ సభ్యులు డా॥ చిత్ర నాగరాజ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా॥ ప్రవీణ్‌కుమార్, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## పాలకుల ఆదేశాలు... పోలీసులకు తిప్పలు

శ్రీకాళహస్తి,మార్చి 30 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తిలో పాలకుల ఆదేశాలతో పలుశాఖల అధికారులు తిప్పలు పడుతున్నారు. పాలకులు అభివృద్ధికి తీసుకుంటున్న నిర్ణయాలు అమలులో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటుంది. ఈ నేపథ్యంలో జనం నుంచి విమర్శలు ఎదుర్కొక తప్పటం లేదు.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి పట్టణంలో భూగర్భ విద్యుత్ కేబుల్ ఏర్పాటు పనుల్లోదిశ దెశ నిర్దేశం లేకుండా సాగుతున్నాయి. ఒక్కొక్క వీధిలో ఒక్కొక్క సారి పనులు చేయాల్సిన కాంట్రాక్టర్లు అలా కాకుండా ఒక్కొక్క వీధిలో పనులు చేపట్టడం తరువాత వాటిని పూర్తి చేయకనే మరో పనులను చేపట్టడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం శ్రీరామనవమి సందర్భంగా పాలకులు నెహ్రూవీధిలో సీతారాముల కళ్యాణోత్సవం చేపట్టారు.ఈ నేపథ్యంలో ఆ వీధిలో రాకపోకలను స్థంభింపజేసారు.ట్రాఫిక్‌ను తేరువీధి,బజారువీధిల నుంచి సాగించాల్సి వచ్చింది. అయితే బజారువీధిలో అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులకు సంబందించి పనులు నత్తనడకన సాగుతున్నాయి. గురువారం ట్రాపిక్‌ను మళ్ళించటంతో ఆ వీధిలో వచ్చే పోయే వాహనాల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.ఓ వైపు కాలువలు వాటిని తవ్విన మట్టిని రోడ్డుమీదనే ఉంచటంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

**పోలీసుల తిప్పలు:**

శ్రీకాళహస్తిలోని వీధులు రాజుల కాలం నాటివి. ఇవి ఆ నాటి జనాభాను పట్టి నిర్మించారు.ప్రస్తుతం పెరిగిన ట్రాఫిక్‌తో అన్ని వాహనాలు ఒకే వీధి నుంచి వెళ్ళటంతో మట్టి కుప్పలతో తిప్పలు ఎదుర్కొన్నారు. దాంతో పోలీసులు బుధవారం రాత్రినుంచి గురువారం ఉదయం నుంచి కూడా మండుటెండల్లో తిప్పలుపడ్డారు. ఓ వైపు బస్సులు,మరో వైపు ద్విచక్రవాహనాలను అదుపుల చేయలేని స్థితి ఉండగా మధ్యలో ఆటోలు లెక్కకు మించి ఉండటంతో పోలీసుల తిప్పలు వర్ణనాతీతంగామారింది. ఆటోల డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవటంతో పోలీసుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

## రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల్లో మజ్దూరు యూనియన్ విజయం

రేణిగుంట, మార్చి 30 ప్రభాతవార్త:



రేణిగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల్లో మజ్దూరు యూనియన్ ట్రేజరర్ స్థానాన్ని దక్కించుకుని తొలి ఖాతా తెరిచింది. ఎన్నికల్లో మజ్దూరు యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ల మధ్య గురువారం ముక్కోణపు పోటీ జరిగింది. ఇంత వరకు ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ పోటీల్లో పాల్గొనలేదు. ఈ సారి పోటీ చేయడంతో దాదాపు 95 శాతం పోలింగ్ జరిగింది. మజ్దూర్ యూనియన్ అభ్యర్థి నరేష్ ట్రెజరర్‌గా తొలి విజయం కైవసం చేసుకున్నారు. యూనియన్‌కు చెందిన సుధాకరన్ జాయింట్ సెక్రటరీగా విజయం సాధించారు. యూనియన్ చెందిన గోపాల్‌సింగ్ కార్యదర్శిగా విజయకేతనం ఎగురవేశారు. కమిటీ మెంబర్లుగా కూడా ముందంజలో దూసుకుపోతున్నారు. తమకు రావాల్సిన ఓట్లను ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ పోటీ చేయడం వల్ల యూనియన్‌కు పడ్డాయని సంఘ్‌నేతలు అంటున్నారు. గెలుపొందిన వారిని మజ్దూర్ యూనియన్ బ్రాంచి సెక్రటరీ సురేష్‌కుమార్, చైర్మన్ వెంకటరమణ, మునిరామయ్య, డివిజనల్ ప్రెసిడెంట్ సుదర్శన్‌రాజు, అడిషనల్ డివిజనల్ సెక్రటరీ వియం బాషా, అడిషనల్ సెక్రటరీ మస్తాన్ వలీ, టెక్నికల్ బ్రాంచ్ చైర్మన్ మునిరత్నంనాయుడు, సెక్రటరీ రవీంద్ర నాయక్, వెంకటగిరి బ్రాంచి కార్యదర్శి చిరంజీవి తదితరులు అభినందించారు.

## ఎస్వీయు మానవ వనరుల అభివృద్ధి కేంద్రానికి యుజిసి నిధులు

తిరుపతి (క్రీడా),మార్చి 30 ప్రభాతవార్త :



శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి 40 లక్షల నిధులను యుజిసి విడుదల చేయడం పై విసి ఆచార్య కె. రాజా రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ నిధులు తీసుకురావడంతో నిరంతరం శ్రమించిన డైరెక్టర్ ఆచార్య కోదండరామిరెడ్డిని అభినందించారు. సదరు గ్రాంటు దస్త్రాన్ని డైరెక్టర్‌కు అందజేసారు. 2021 - 2022 సంవత్సరానికి రావాల్సిన నిధులు పూర్తిగా వచ్చాయని, గడిచిన రెండు విద్యా సంవత్సరాలలో యుజిసి ద్వారా రావాల్సిన 2.45 కోట్లు ఎస్వీయుకి అందాయని విసి చెప్పారు. ఆచార్య కోదండరామిరెడ్డి డైరెక్టర్‌గా ఎస్వీయు హెచ్‌ఆర్‌డిసి సమర్ధవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. వారు మార్చి 31న ఉద్యోగవిరమణ చేస్తున్న సందర్భంగా ఆ కేంద్ర నిర్వహణ బాధ్యతలను ఫిజిక్స్ విభాగ ఆచార్యులైన ఆర్‌పి విజయలక్ష్మికి అప్పగించే ఉత్తర్వులను అందజేసారు. ప్రస్తుతం ఫిజిక్స్ విభాగాధిపతిగా ఉన్న ఆమె డైరెక్టర్‌గా పదవి భాధ్యతలు చేపడుతారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, డా. ప్రయాగ, డా. నాగరాజశ్రీ పాల్గొన్నారు.

## గాంధీనగర్‌లో సురక్షిత నీటి శుద్ధి నీరు సరఫరా

-నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన ప్రదీప్‌కుమార్

తిరుపతిరూరల్, మార్చి30 ప్రభాతవార్త:



చిత్తూరు నెహ్రు యువ కేంద్ర సౌజన్యంతో మహర్షి అభ్యుదయ సేవా సంస్థ తిరుపతిరూరల్ గాంధీపురం సచివాలయ ప్రాంగణంలో సురక్షితంగా నీటి శుద్ధి చేసి ప్రజలకు అందిస్తున్న విషయం తెల్సిందే. నీటి శుద్ధి కేంద్రాన్ని జిల్లా యువజన అధికారి బి.ప్రదీప్‌కుమార్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే వనరులను స్వచ్ఛంద సంస్థల ద్వారా ఏర్పాటు చేయడం కొరకు చిత్తూరు నెహ్రు యువకేంద్రం మొత్తం ఖర్చులో కొంత భాగం నిధులుగా మంజూరు చేయబడిందని తెలిపారు. మాస్ స్వచ్ఛంధ అధ్యక్షులు కే.జ్ఞానశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 20 లీటర్ల శుద్ధమైన సురక్షిత త్రాగునీరును కేవలం రెండు రుపాయలకే సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రాంతీయ గణాంక అధికారి ఎం.సి.బాబు రెడ్డి, రాజేష్, సుమారు 100 యువత పాల్గొన్నారు.

## ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం కోసం బైక్ ర్యాలీ

బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 30 ప్రభాతవార్త:



ఏప్రిల్ 5న మోదీ ప్రభుత్వానికి నిరసనగా ఛలో ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో జరిగే సంఘర్షణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలపై భారాలు వేస్తూ కార్పొరేట్ కంపెనీలకు, ధనవంతులకు, వ్యాపారవేత్తలకు లాభాలు కలుగజేసే విధంగా ప్రజల సొమ్మునఉ కట్టబెడతున్నారని తీవ్రంగా విమర్శించారు. రైతులకు ఇప్పుడున్న చట్టాలను రద్దు చేస్తూ ఇటీవల నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతుల పోరాటంతో రద్దు చేసిన మోదీ మళ్లీ అదే చట్టాలను చాప కింద నీరులా అమలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నలుగూరి రమణయ్య, తలారి బాలకృష్ణ, ఉపాధ్యక్షులు గురవమ్మ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రంగయ్య, కౌలు రైతు సంఘం నాయకుడు టి.బాల గురవయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, గురవయ్య, నాగరాజు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశాండి అరుణాచలం, హరి, సుబ్బయ్య, చిన్న గురవయ్య, తిరుపాలు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు ఆలయాలకు కుంభాభిషేకాలు

శ్రీకాళహస్తి,మార్చి 30 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఆలయాల జీర్ణోద్ధారణ కార్యక్రమాలు పూర్తి చేసి గురువారం కుంభాభిషే కాలను నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా అంజూరు తారక శ్రీనివాసులు బాధ్యత చేపట్టిన ఏడాదిలో అనుబంధ ఆలయాలకు సంబంధించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.ఈ నేపథ్యంలో వీరభద్రస్వామి ఆలయంలో బాలాలయ స్థాపన, కాలభైరవస్వామి, చక్రేశ్వరస్వామి, చల్లేశ్వరస్వామి ఆలయాలకు బాలాలయాలను ఏర్పాటు చేసారు.స్థానిక స్థానాచార్యులు డాక్టర్ స్వామినాధన్ గురుకకుల్ పర్యవేక్షణలో సంకల్ప పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలను ఆలయం ఇఒ వికె సాగర్‌బాబు పర్యవేక్షించారు. గతంలో ఏ పాలక మండలి పట్టించుకోక పోవటంతో అనుబంధ ఆలయాలు శిధిలమయ్యాయి. వాటిని జీర్ణోద్ధారణ గావించి పూర్వ వైభవం తీసుకురావటానికి చర్యలు తీసుకున్నారు.సుమారు రూ.కోటితో మరమ్మత్తులు చేపట్టారు.నీలకంఠేశ్వరస్వామి ఆలయాన్ని రూ.16లక్షలతో నూతన ఆర్చి నిర్మాణానికి భూమి పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకులు సంబంధం గురుకుల్ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, నిరంజన్ గురుకుల్,అభిషేక గురుకుల్స్ పాల్గొన్నారు. వీరితో పాటు పాలక మండలి సభ్యులు ఆలయాధికారులు ఇఇ మురళీధర్‌రెడ్డి, ఎఇఒ లోకేష్‌రెడ్డి, నాగభూషణం, లక్ష్మయ్య, సుదర్శనరెడ్డి, కామేశ్వరరావు రాముగురుకుల్, కమల్ గురుకుల్,నీలకంఠ గురుకుల్, గోవిందశర్మ, చందూశర్మ, గోపి శర్మ, రాకీ శర్మ,మోహన్ శర్మ భక్తులు పాల్గొన్నారు.

## సంబరంగా సీతారాముల కళ్యాణం...కదలి వచ్చిన భక్త జనం

శ్రీకాళహస్తి,మార్చి 30 ప్రభాతవార్త :





శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న నెహ్రూవీధిలోని పట్టాభిరామస్వామి ఆలయంలో గురువారం కన్నుల పండువగా అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం నిర్వహించారు. ఈ ఉత్సవాలను పాలకులు,అధికారులు, భక్తులు సంబరంగా పాల్గొన్నారు. ఇక్కడ ఏర్పాట్లను మూడు రోజుల పాటు ఆలయ చైర్మెన్ అంజూరుతారక శ్రీనివాసులు ఇఒ వికె సాగర్‌బాబు ఈ సారి వేదికను కన్నుల పండువగా నిర్వహించారు. గురువారం నెహ్రూవీధి కళ్యాణ మండపంగా మారి, ఈ ప్రాంతం ఎప్పుడూ ట్రాఫిక్‌తో రద్దీగా ఉంటుంది కాబట్టి పోలీసుల సహకారం తీసుకున్నారు. సిఐ అంజూయాదవ్ సూచనలతో రియాజ్‌బాషా వారి సహాచరులు చక్కగా పర్యవేక్షించారు.

**నిత్యకళ్యాణం పచ్చతోరణంలా . . .**

సీతారాముల కళ్యాణం సందర్భంగా ఆలయాన్ని పరిసరాలను ముచ్చటగా తీర్చి దిద్దారు.అరటి చెట్లతోనూ, మామిడి తోరణాలు, చక్కటి పందిళ్లు ఏర్పాటు చేసారు.కళ్యాణ వేదిక నేటి వివాహ వ్యవస్థకు అద్దం పట్టే రీతిలో రూపొందించారు. సంప్రదాయ బద్దంగా వధువు, వరుని తరపున బంధువులుగా ఓ వైపు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు దంపతులు, మరో వైపు ఆలయాధికారి వి కె సాగర్‌బాబు, పెళ్లి పెద్దలుగా ధర్మకర్తల మండలి చైర్మెన్ సభ్యులు హాజరై సంకల్పం చేసారు. వివాహం సందర్భంగా హాజరైన మహిళా భక్తులకు శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి తనయ బియ్యపు పవిత్రరెడ్డి పసుపు కుంకుమ, జాకెట్‌ను ప్రసాదంగా అందించారు.

కళ్యాణోత్సవానికి ధర్మకర్తల మండలి సభ్యులు బుల్లెట్ జయశ్యాం, మున్నారాయల్,సుమతి, రమాప్రభ, లక్ష్మీ హాజరయ్యారు.

ఏర్పాట్లను ఇఒ వికె సాగర్‌బాబు పర్యవేక్షణలో ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఎఇఒలు సతీష్‌మాలిక్, లోకేష్‌రెడ్డి సూపరింటెండెంట్ నాగభూషణం,చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాసశర్మ, వేద పండితులు బాల సుబ్రమణ్యం, ఆంజనేయ శర్మ,పలువురు ఆలయాధికారులు పట్టణ ప్రముఖులు భాస్కర్‌ముదిరాజ్, ఆనందగుప్తా, భాస్కర్‌రెడ్డి, కుమార్, మురళి, హరినాయుడు, శేఖర్, ఉదయ్‌కుమార్, వెంకటసుబ్బయ్య, పసల కుమార్,బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్రకు విశేష ఆదరణ : భానుప్రకాశ్

పుత్తూరు, మార్చి 30 ప్రభాతవార్త :



యువగళం పేరిట తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి చేస్తున్న పాదయాత్రకు విశేష ఆదరణ లభిస్తోందని టిడిపి నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ తెలిపారు. గురువారం అనంతపురం జిల్లా పెనుగొండలో జరిగిన లోకేష్ పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. చిత్తూరులో జిల్లాలో లభించిన విధంగా అనంతపురం జిల్లాలో కూడా లోకేష్ పాదయాత్రకు జనం నీరాజనాలు పడుతున్నారని, భారీ సంఖ్యలో జనం హాజరవుతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టిడిపిదే విజయమని పేర్కొన్నారు.

## కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఘనంగా వార్షికోత్సవం

- ముఖ్యఅతిథిగా హాజరైన నటుడు రాజ్ తరుణ్ !!

కుప్పం, మార్చి 30 ప్రభాతవార్త :



కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ 22వ వార్షికోత్సవం నాగాస్త్ర 2023 కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రముఖ సినీనటుడు రాజ్ తరుణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన తనదైన శైలిలో విద్యార్థులను ఆకట్టుకున్నారు. తన సినీజీవిత విశేషాల గురించి అనుభూతులు పంచుకున్నారు. కళాశాల ఛైర్మన్ బిసి నాగరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. నటుడు రాజ్ తరుణ్ ఈ వేడుకలకు హాజరు కావడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించుటకు సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈసందర్భంగా వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు రాజ్ తరుణ్ బహుమతులు అందించారు. అనంతరం కళాశాలకు విశిష్టసేవలు అందిస్తున్న అధ్యాపకేతర సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్, వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఒ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం సన్నిధిలో మంత్రి అంబటి రాంబాబు

కాణిపాకం, మార్చి 30 ప్రభాతవార్త:



రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు గురువారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన మంత్రికి పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు ఎమ్మెస్ బాబు, ఆరణి శ్రీనివాసులులు ఘనంగా స్వాగతం పలుకగా రాజగోపురం వద్ద ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. మంత్రి వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి,శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, బాలాజినాయుడు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా వుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు ఎమ్మెస్ బాబు, ఆరణి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎస్పీ, అడ్మిన్ ఎఎస్పీలు

చిత్తూరు, మార్చి 30 ప్రభాతవార్త:



చిత్తూరు ఏఆర్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం చిత్తూరు నగరంలోని ఏఆర్ టాప్‌లైన్, పిజిఆర్ పోలీసు క్వాటర్స్‌లో వెలసిన శ్రీసీతారామ ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రీరామనవమి వేడుకల్లో కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, అడ్మిన్ ఎఎస్పీ జగదీష్ తదితరులు హాజరై సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి, అడ్మిన్ ఎఎస్పీ జగదీష్‌లు శ్రీసీతారాముల వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే ఏఆర్ డిఎస్పీ జి.నాగేశ్వరరావు దంపతులు స్వామి వారి కళ్యాణోత్సంలో పాల్గొని పూజలు నిర్వహించారు. సీతారాముల వారిని జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ చైతన్యకుమార్‌రెడ్డి దంపతులు, ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్‌లు దర్శించుకొన్నారు. స్వామి వారి ఆలయంలో పూజలు నిర్వహించిన కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ చైతన్యకుమార్‌రెడ్డి, ఏఆర్ డిఎస్పీ జి.నాగేశ్వరరావు, ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్‌ల ఆలయంలో విశేష పూజలు నిర్వహించి పూజారుల నుండి ఆశీర్వచనాలు తీసుకొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ, అడ్మిన్ ఎఎస్పీ దంపతుల చేతుల మీదుగా 700 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నగర డిఎస్పీ శ్రీనివాసమూర్తి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి, దిశా డిఎస్పీ బాబు ప్రసాద్, డిటిసి డిఎస్పీ శ్రావణ్‌కుమార్, ఏఆర్ డిఎస్పీ కృష్ణమోహన్, ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గంగిరెడ్డి, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ మద్దయ్యాచ్చారి, ఆర్‌ఐలు నీలకంఠేశ్వరరెడ్డి, మధులు, నగర ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయంలో వేడుకగా శ్రీరామనవమి ఆస్థానం

తిరుమల,మార్చి 30 ప్రభాతవార్తప్రతినిధి:



త్రేతాయుగంలో నమ్మిన ధర్మంకోసం ఆదర్శమూర్తిగా నిలచిన శ్రీరామ చంద్రమూర్తి ఆశీస్సులతో ప్రపంచం లోని ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని ప్రార్థించినట్లు టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి తెలిపారు. శ్రీరామ నవమిపర్వదినం పురస్కరించుకుని గురువారం ఉదయం గోవిందుని ఆలయంలో సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు విశేష అభిషేకాలు,రాత్రి బంగారువాకిలిలో శ్రీరామనవమి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిపించారు.

## చదువుతోనే ఉజ్జ్వల భవిష్యత్తు

-పదవతరగతి విద్యార్థులకు సాయంలో న్యాయవాది అంబిక

తిరుపతి,మార్చి 30ప్రభాతవార్త:



ఆధునిక సమాజంలో మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకుని ఉన్నతవిద్యావంతు లైనపుడు జీవితం ఉజ్జ్వలభవిష్యత్తుగా ఉంటుందని న్యాయవాది ఎస్‌ఎం అంబిక తెలిపారు. విద్యతోనే ఉన్నత విలువలు అలవడుతాయని, చదువుకు పేదరికం అడ్డుకారాదని అన్నారు. చక్కగా చదువుకుని ఉన్నతులుగా రాణిస్తే ఆ కుటుంబం, గ్రామం, పరిసరాలు అభివృద్ధి చెందుతాయని న్యాయవాది సూచించారు. తిరుచానూరుకు చెందిన పద్మకళాక్షేత్ర అకాడమీకి చెందిన 20మంది 10వతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న పేదవిద్యార్థినులకు అవసరమైన ఎగ్జామ్‌ప్యాడ్స్,పేనాలు,జామెంట్రీబాక్సులను "ఎస్" భారత్ ఆన్‌లైన్ టిక్కెట్స్ సర్వీసెస్ అధినేత ఎస్.వెంకటకృష్ణ, న్యాయవాది ఎస్‌ఎం అంబిక సహకారంతో గురువారం పెద్దకాపులేఔట్‌లోని కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. అకాడమీ టీచర్ శ్రీదేవి విజ్ఞప్తి మేరకు పేదపిల్లలకు తమవంతు చిన్న సహాయం అందించి వారు ఉన్నతులుగా చదువుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. పిల్లలు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులై పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని దాతలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, రవి, శ్రీదేవి, పిల్లలు పాల్గొన్నారు.

## శ్రీ సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి దంపతులు

పుత్తూరురూరల్, మార్చి 30 ప్రభాతవార్త:



శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని పుత్తూరు లోని శ్రీ కోదండరామస్వామి వారి దేవాలయంలో గురువారం మంత్రి రోజా, సెల్వమణి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంత్రి రోజా, సెల్వమణి దంపతులు కార్వేటినగరం రోడ్డులోని మండపం నుంచి కాలినడకన వెళ్లి శ్రీ సీతారాముల వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కోదండరామస్వామివారి ఆలయ కార్య నిర్వహణాధికారి, ఉత్సవ కమిటీ సభ్యులు మంత్రి రోజా, సెల్వమణి దంపతులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయంలో పూజారులు వేద మంత్రాల తో విశేష పూజలు నిర్వహించి మంత్రి దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోదండ రామస్వామివారి ఆలయంలో గురువారం నుంచి పది రోజుల పాటుజరిగే ఈ బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, వైసీపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# తుమ్మలగుంటలో వేడుకగా శ్రీరామనవమి వేడుకలు

-సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు

తిరుపతిరూరల్, మార్చి30 ప్రభాతవార్త:

శ్రీరామ నవమి పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం తుమ్మలగుంటలో సీతారాముల కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులతో సందడిగా మారింది. భాజాభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. జగదాభిరాముని కళ్యాణాన్ని భక్తులు కనులారా వీక్షించి, తరించారు. ముందుగా ఆలయంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను కళ్యాణ మండపంకు తీసకుని వచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పీటలపై ప్రతిష్టింప చేసారు. ముందుగా విశ్వక్సేనారాధన, గణపతి పూజలతో కళ్యాణం దిగ్విజయంగా కొనసాగింప జేయాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేసారు. అర్చక



స్వాములు రక్షాబంధనాలను సీతా అమ్మవారి రాములవారి ముంజేతికి చేతులకు తాకించి సీతాదేవి మెడలో అలంకరించారు. భక్తులు జయ జయధ్వానాలు పలుకగా తలంబ్రాలను సీతారాముల తలలపై ఉంచి, కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని ముగింప జేసారు. అంతకమునుపు తుమ్మలగుంట మాజీ ఎంపిటిసి సభ్యుడు నల్లందుల సుధాకర్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు హజరై, వివాహ మహోత్సవాన్ని తిలకించారు. ప్రతి ఏటా కళ్యాణ వెంకన్న ఆలయం వద్ద జరిగే శ్రీ సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి జనం పెద్దఎత్తున తరలి వచ్చారు.